





RNI NO.TGTEL/25/A5224

# జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం








కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 247 శుక్రవారం, సెప్టెంబర్ 25 2026, పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com


# గందరగోళంగా ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్ సైట్.

- పక్షం రోజులుగా తప్పుడు రిపోర్ట్ లతో సిబ్బందికి చుక్కలు చూపుతున్న సర్వర్లు..
- నమోదైన రైతులను జాబితానే కానట్లు చూపుతున్నట్లు వాపోతున్న ఏఈవోలు..
- ఈ జాబితాతో శిబిరం నిర్వహిస్తే ఎలా అని తలలు పట్టుకుంటున్న వైనం..
- పట్టించుకొని డైరెక్టర్ గోపి
- తుమ్మల జరా శాఖ నీ దేకో..






**(జోర్దార్ హైదరాబాద్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్)**
రాష్ట్రంలో ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్‌సైట్ సాంకేతిక లోపాల సుడిగుండంలో చిక్కుకుంది. గత పక్షం రోజులుగా సర్వర్ల తీవ్ర మొరాయింపు, తప్పుడు నివేదికల ప్రదర్శనతో క్షేత్రస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాత్రింబవళ్లు కష్టపడి రైతుల డేటాను నిరంతరం నమోదు చేస్తున్నప్పటికీ, పోర్టల్ మాత్రం నమోదైన రైతుల వివరాలను అసలు నమోదు కానట్లే చూపిస్తూ గందరగోళం సృష్టిస్తోంది.

**శిబిరాల నిర్వహణపై నీలినీడలు:**
ఇలాంటి అసంపూర్ణ, తప్పుడు జాబితాలతో రైతు వేదికలు, గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఎలా నిర్వహించాలని ఏఈవోలు తలలు పట్టుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఇప్పటికే వివరాలు అందించిన రైతులు జాబితాల్లో పేర్లు కనిపించకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసే పరిస్థితి నెలకొంది.

**అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న డైరెక్టరేట్:**
గత పక్షం రోజులుగా క్షేత్రస్థాయి సిబ్బంది చుక్కలు చూస్తున్నా, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాత్రం సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టకుండా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల నుంచి సరైన సాంకేతిక భరోసా కొరవడటంతో ఏఈవోలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

**మంత్రి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి:**
క్షేత్రస్థాయిలోని ఈ దుస్థితిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించాలని సిబ్బంది కోరుతున్నారు. "తుమ్మల జరా శాఖ నీ దేకో" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ, సర్వర్ల సామర్థ్యం పెంచి, తప్పుడు నివేదికల సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన తర్వాతే శిబిరాల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# హనుమకొండ ప్రభుత్వ కళాశాలలో కలకలం.. విద్యార్థినిపై అధ్యాపకుడి వేధింపుల ఆరోపణలు!

**ఫిర్యాదు చేసినా చర్యలు లేవంటూ ఆరోపణలు.. అధ్యాపకుడిని, ప్రిన్సిపాల్‌ను నిలదీసిన విద్యార్థిని బంధువులు**

**హనుమకొండ/హైదరాబాద్ జోర్దార్ నిఘా బృందం:**
హనుమకొండ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థినిపై అధ్యాపకుడు అసభ్యంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. విద్యార్థులను కంటికి రెప్పలా చూసుకోవాల్సిన అధ్యాపకుడిపైనే ఇలాంటి ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 10న కళాశాలలో వెల్‌కమ్ పార్టీ ఏర్పాట్లలో భాగంగా జాతీయ సేవా పథకం విద్యార్థులను పిలిచిన సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.కళాశాలలోని మూడు అంతస్తుల భవనంలోని ఓ స్టోర్‌రూమ్‌లో ఉన్న విద్యార్థిని వద్దకు సదరు అధ్యాపకుడు వెళ్లి అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థిని ఏడుస్తూ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అనంతరం ఇంటర్ బోర్డుకు చెందిన రాష్ట్రస్థాయి అధికారి ముఖ్యఅతిథిగా హాజరైన వెల్‌కమ్ పార్టీ నిర్వహించినట్లు తెలిసింది.అయితే విద్యార్థిని ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోకుండా సంబంధిత అధ్యాపకుడికి ప్రిన్సిపాల్ మద్దతుగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడంతో బాధితురాలి బంధువులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గత మంగళవారం వారు కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకుడిని నిలదీసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన బంధువులు అధ్యాపకుడిపై చెప్పులతో దాడి చేసి, నినాదాలు చేస్తూ అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.దిలా ఉండగా, సదరు అధ్యాపకుడిపై గతంలో జనగామ జిల్లాలో పోక్సో చట్టం కింద కేసు నమోదై అరెస్టు అయి జైలుకు వెళ్లినట్లు, అనంతరం ఉద్యోగం నుంచి సస్పెండ్ అయినట్లు సమాచారం. ప్రస్తుతం విద్యార్థినిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలోనూ సంబంధిత అధ్యాపకుడిపై చర్యలు తీసుకోలేదంటూ విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. విద్యార్థుల భద్రతకు బాధ్యత వహించాల్సిన విద్యాసంస్థలో ఇలాంటి ఆరోపణలు రావడంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఈ వ్యవహారంపై కళాశాల ప్రిన్సిపాల్ వివరణ తెలుసుకునేందుకు 'జోర్దార్' ప్రతినిధి ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన లభించలేదని సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న అధ్యాపకుడిపై గతంలో కేసు, సస్పెన్షన్ జరిగిందనే వివరాలను కూడా సంబంధిత అధికారులు అధికారికంగా పరిశీలించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. విద్యార్థినికి న్యాయం జరిగేలా ఘటనపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించి, ఆరోపణలు నిజమని తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అయితే విద్యార్థినిపై వేధింపులకు సంబంధించిన ఆరోపణలు, అధ్యాపకుడిపై గతంలో కేసు నమోదైందనే వివరాలు సంబంధిత అధికారులు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. బాధిత విద్యార్థిని గుర్తింపును వెల్లడించకుండా జరిపి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.

# మంజూరు ఒక లెక్క.. ఇన్వాయిస్ మరో లెక్క.. రైతు వేదికల వీసీ కొనుగోళ్లపై కలకలం

**- రూ.8.39 కోట్ల వ్యత్యాసంపై ప్రశ్నలు.. కృషి మ్యాపర్‌లో ఏ మొత్తం నమోదు చేస్తున్నారు?**




**హైదరాబాద్ జోర్దార్ నిఘా విభాగం**
రాష్ట్రంలోని సుమారు 1,600 రైతు వేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సింగ్ యూనిట్ల కొనుగోళ్లకు సంబంధించిన నిధుల లెక్కలపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అందుబాటులో ఉన్న సమాచారం, ఇన్వాయిస్ వివరాల ప్రకారం ఒక్కో వీడియో కాన్ఫరెన్సింగ్ యూనిట్‌కు ప్రభుత్వం రూ.3,70,000 మంజూరు చేసినట్లు తెలుస్తుండగా, సంబంధిత వెండర్ ఇన్వాయిస్‌లో ఒక్కో యూనిట్ విలువ రూ.3,17,539గా నమోదైనట్లు సమాచారం. ఈ రెండు మొత్తాలను లెక్కిస్తే ఒక్కో యూనిట్‌కు రూ.52,461 వ్యత్యాసం కనిపిస్తోంది. 1,600 యూనిట్లకు ఇదే మొత్తాన్ని వర్తింపజేస్తే రూ.8,39,37,600, అంటే సుమారు రూ.8.40 కోట్ల తేడా వస్తోంది.ఈ భారీ వ్యత్యాసానికి అసలు కారణం ఏమిటన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ప్రభుత్వం ఒక్కో యూనిట్‌కు రూ.3.70 లక్షలు ఎందుకు మంజూరు చేసింది? వెండర్ ఇన్వాయిస్‌లో రూ.3,17,539 మాత్రమే ఎందుకు చూపించారు? మంజూరు చేసిన మొత్తం, వాస్తవంగా వెండర్‌కు చెల్లించిన మొత్తం ఎంత? ఒక్కో యూనిట్‌కు మిగిలిన రూ.52,461 చొప్పున వచ్చిన మొత్తం ఎక్కడ జమైంది? ప్రభుత్వ ఖజానాకు తిరిగి చెల్లించారా? పరికరాల సరఫరా, ఇన్‌స్టాలేషన్, పన్నులు, నిర్వహణ లేదా ఇతర సేవల పేరుతో సర్దుబాటు చేశారా? అన్న అంశాలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.ఇదిలా ఉండగా, వెండర్ ఇన్వాయిస్‌లో నమోదైన వాస్తవ మొత్తానికి బదులుగా పూర్తి మంజూరు మొత్తం రూ.3.70 లక్షలను కృషి మ్యాపర్ యాప్‌లో నమోదు చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిపై మౌఖికంగా ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకవైపు ఇన్వాయిస్‌లో రూ.3,17,539 ఉండగా, మరోవైపు పోర్టల్‌లో రూ.3.70 లక్షలు నమోదు చేస్తే ఈ రెండు రికార్డుల మధ్య వ్యత్యాసం ఎందుకు వస్తుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇలాంటి వివరాలు భవిష్యత్తులో ఆడిట్, లెక్కల తనిఖీలకు గురైనప్పుడు క్షేత్రస్థాయి సిబ్బందికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని కొందరు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈ మేరకు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పడానికి సంబంధించి అధికారిక లిఖితపూర్వక ఉత్తర్వులు ప్రస్తుతం బహిర్గతం కాలేదు.అసలు లెక్కలు తేలాలంటే కేవలం మంజూరు ఉత్తర్వులు, వెండర్ ఇన్వాయిస్‌లను మాత్రమే కాకుండా ప్రతి రైతు వేదికకు సంబంధించిన పూర్తి రికార్డులను పరిశీలించాల్సి ఉంటుంది. 1,600 యూనిట్లకు మంజూరైన మొత్తం ఎంత? వెండర్‌కు చేసిన వాస్తవ చెల్లింపు ఎంత? ఇన్వాయిస్‌లో చూపిన మొత్తం ఎంత? పన్నులు, రవాణా, ఇన్‌స్టాలేషన్, ఇతర సేవలకు ఎంత ఖర్చు చేశారు? మిగిలిన మొత్తం ఏ ఖాతాలో జమైంది? కృషి మ్యాపర్‌లో ఎంత నమోదు చేశారు? అనే వివరాలను సరిపోల్చితేనే రూ.8,39,37,600గా కనిపిస్తున్న వ్యత్యాసానికి అసలు కారణం ఏమిటో స్పష్టమయ్యే అవకాశం ఉంది.ఈ అంశంపై స్పష్టత కోసం 'జోర్దార్' ప్రతినిధి వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులను, వ్యవసాయ కమిషనర్ కార్యాలయాన్ని సంప్రదించేందుకు ప్రయత్నించారు. సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా, అందుబాటులో ఉన్న ఇతర సంప్రదింపు మార్గాల ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. అలాగే సంబంధిత వెండర్ ప్రతినిధుల నుంచి కూడా ఈ లెక్కలపై వివరణ తెలుసుకునేందుకు ప్రయత్నించారు. అయితే కథనం ప్రచురించే సమయానికి వ్యవసాయ శాఖ, వ్యవసాయ కమిషనర్ కార్యాలయం లేదా సంబంధిత వెండర్ నుంచి అధికారిక సమాధానం అందలేదు.ఈ వ్యవహారంలో ఆరోపణలు వాస్తవమా? లెక్కల్లో ఏదైనా సాంకేతిక లేదా పరిపాలనా కారణంతో వ్యత్యాసం ఏర్పడిందా? లేక మంజూరు, ఇన్వాయిస్, చెల్లింపులు, పోర్టల్‌లో నమోదైన వివరాల మధ్య నిజంగానే తేడా ఉందా? అన్నది సంబంధిత శాఖ అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. ఆరోపణలకు సంబంధించి సంబంధిత అధికారులు, వెండర్ తమ వివరణను అందిస్తే దానిని కూడా యథాతథంగా ప్రచురించేందుకు 'జోర్దార్' సిద్ధంగా ఉంది.ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమాచారం, లభించిన ఇన్వాయిస్ వివరాలు, లెక్కల ఆధారంగానే ఈ కథనం రూపొందించబడింది. రూ.3,70,000 మంజూరు మొత్తంలో నుంచి రూ.3,17,539 ఇన్వాయిస్ మొత్తాన్ని తీసివేస్తే ఒక్కో యూనిట్‌కు రూ.52,461 తేడా వస్తుంది. 1,600 యూనిట్లకు రూ.52,461 చొప్పున లెక్కిస్తే రూ.8,39,37,600 వస్తుంది. ఈ మొత్తానికి సంబంధించిన పూర్తి లెక్కలను వ్యవసాయ శాఖ అధికారికంగా వెల్లడిస్తేనే వ్యవహారంపై నెలకొన్న అనుమానాలకు తెరపడే అవకాశం ఉంది.

# కరీంనగర్ డీఈఓ కార్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా అధికారులు?

-- పదేళ్లు గడిచినా పాఠశాలకు వెళ్లని అధికారులపై చర్యలు ఏవీ?
-- అందరు టీచర్లకు వర్తించిన 317 నిబంధన ఇద్దరు అధికారులకు వర్తించదా?
-- నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల డిమాండ్




**(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి)**
కరీంనగర్ జిల్లాలో ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ పదేళ్లుగా బదిలీ కాకుండా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగుతున్న అధికారుల వ్యవహారంపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) కార్యాలయంలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, ఏపీఓగా పనిచేస్తున్న అధికారులు సుమారు పదేళ్ల క్రితం ఉద్యోగంలో చేరినప్పటికీ, ఇప్పటికీ కార్యాలయంలోనే కొనసాగుతున్నారని ఆరోపిస్తున్నారు.విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఐదేళ్లు పూర్తయిన తర్వాత సంబంధిత అధికారులు తమకు కేటాయించిన పాఠశాలలు లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. 2022లో అమలు చేసిన 317 నిబంధనల ప్రకారం అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌ను పెద్దపల్లి జిల్లాకు కేటాయించినప్పటికీ, ఆయన అక్కడికి వెళ్లకుండా కరీంనగర్ జిల్లాలోనే కొనసాగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి.అదేవిధంగా ఏపీఓను 317 నిబంధనల ప్రకారం సిరిసిల్ల జిల్లాకు కేటాయించినప్పటికీ, ఆయన కూడా కరీంనగర్ జిల్లా డీఈఓ కార్యాలయంలోనే కొనసాగడంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.టీచర్లు, హెడ్‌మాస్టర్ల విషయంలో ప్రభుత్వ ఆదేశాలను, బదిలీ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్న అధికారులు.. అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్, ఏపీఓ విషయంలో మాత్రం పదేళ్లుగా ఒకే చోట కొనసాగించడంపై వివరణ ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారుఐదేళ్లు పూర్తయిన వెంటనే రాత పరీక్ష నిర్వహించి అర్హులైన వారిని నియమించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తూ కొనసాగుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సామాజికవేత్త రాధాకృష్ణ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

## కరీంనగర్ డీఈఓ కార్యాలయంలో నిబంధనలకు తూట్లు..

# పదేళ్లుగా ఒకేచోట

**టీచర్లకు 317 బదిలీ నిబంధనలు.. అధికారులకు మాత్రం వర్తించవా?**

**కరీంనగర్ జోర్దార్ నిఘా విభాగం**
కరీంనగర్ జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కొందరు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. దాదాపు 10 ఏళ్లుగా డీఈఓ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్న అధికారులను నిబంధనల ప్రకారం ఇతర ప్రాంతాలకు బదిలీ చేయకుండా కొనసాగించడంపై ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, సామాజిక కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం 5 ఏళ్లు పూర్తయిన అనంతరం సంబంధిత అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాలకు వెళ్లాల్సి ఉండగా, కరీంనగర్ డీఈఓ కార్యాలయంలో మాత్రం కొందరు అధికారులు ఇంతకాలం ఎలా కొనసాగుతున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.2022లో అమలులోకి వచ్చిన 317 బదిలీ ఉత్తర్వుల ప్రకారం డీఈఓ కార్యాలయంలోని అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్‌ను పెద్దపల్లి జిల్లాకు కేటాయించినట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అదేవిధంగా ఏపీఓను సిరిసిల్ల జిల్లాకు కేటాయించినప్పటికీ




ఆయన కరీంనగర్ డీఈఓ కార్యాలయంలోనే కొనసాగుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. 317 నిబంధనల ప్రకారం కేటాయింపులు జరిగినప్పటికీ సంబంధిత అధికారులు అక్కడికి వెళ్లకుండా కరీంనగర్‌లోనే విధులు నిర్వహించడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు.టీచర్లు, ప్రధానోపాధ్యాయుల విషయంలో బదిలీ నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తున్న అధికారులు తమ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారుల విషయంలో మాత్రం ఎందుకు భిన్నమైన విధానం పాటిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 5 ఏళ్లు పూర్తయిన తర్వాత నిబంధనల ప్రకారం వారిని బదిలీ చేయడంతో పాటు, అవసరమైతే రాత పరీక్ష నిర్వహించి అర్హులైన వారిని నియమించాలని సామాజికవేత్త రాధాకృష్ణ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా 10 ఏళ్లుగా ఒకే కార్యాలయంలో కొనసాగుతున్నారా అనే అంశంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తప్పు తేలితే చర్యలు తీసు కోవాలని ఆయన కోరారు. 317 ఉత్తర్వుల అమలులో అందరికీ ఒకే విధమైన నిబంధనలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

GENERAL NEWS జనరల్

శుక్రవారం, సెప్టెంబర్ 25 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# గందరగోళంగా ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్ సైట్

- పక్షం రోజులుగా తప్పుడు రిపోర్ట్ లతో సిబ్బందికి చుక్కలు చూపుతున్న సర్వర్లు..
- నమోదైన రైతులను జాబితానే కానట్లు చూపుతున్నట్లు వాపోతున్న ఏఈవోలు..
- ఈ జాబితాతో శిబిరం నిర్వహిస్తే ఎలా అని తలలు పట్టుకుంటున్న వైనం..
- పట్టించుకొని డైరెక్టర్ గోపి
- తుమ్మల జరా శాఖ నీ దేకో..






**(జోర్ధార్ హైదరాబాద్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్)** రాష్ట్రంలో ఫార్మర్ రిజిస్ట్రీ వెబ్‌సైట్ సాంకేతిక లోపాల సుడిగుండంలో చిక్కుకుంది. గత పక్షం రోజులుగా సర్వర్ల తీవ్ర మొరాయింపు, తప్పుడు నివేదికల ప్రదర్శనతో క్షేత్రస్థాయి వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవోలు) తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాత్రింబవళ్లు కష్టపడి రైతుల డేటాను నిరంతరం నమోదు చేస్తున్నప్పటికీ, పోర్టల్ మాత్రం నమోదైన రైతుల వివరాలను అసలు నమోదు కానట్లే చూపిస్తూ గందరగోళం సృష్టిస్తోంది.

**శిబిరాల నిర్వహణపై నీలినీడలు:**
ఇలాంటి అసంపూర్ణ, తప్పుడు జాబితాలతో రైతు వేదికలు, గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఎలా నిర్వహించాలని ఏఈవోలు తలలు పట్టుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఇప్పటికే వివరాలు అందించిన రైతులు జాబితాల్లో పేర్లు కనిపించకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసే పరిస్థితి నెలకొంది.

**అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్న డైరెక్టరేట్:**
గత పక్షం రోజులుగా క్షేత్రస్థాయి సిబ్బంది చుక్కలు చూస్తున్నా, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి మాత్రం సమస్య పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టకుండా అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల నుంచి సరైన సాంకేతిక భరోసా కొరవడటంతో ఏఈవోలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

**మంత్రి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి:**
క్షేత్రస్థాయిలోని ఈ దుస్థితిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించాలని సిబ్బంది కోరుతున్నారు. "తుమ్మల జరా శాఖ నీ దేకో" అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ, సర్వర్ల సామర్థ్యం పెంచి, తప్పుడు నివేదికల సమస్యను శాశ్వతంగా పరిష్కరించిన తర్వాతే శిబిరాల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆపదలోనూ ముందుండి సేవలందించిన హుజురాబాద్ పోలీసులు



**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:** హుజురాబాద్‌లో భారీ వర్షం, ఈదురుగాలులకు వరంగల్--కరీంనగర్ జాతీయ రహదారిపై నాగేంద్ర దాబా సమీపంలో భారీ చెట్లు నేలకొరిగి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న టౌన్ సీఐ కరుణాకర్ వెంటనే పోలీసు సిబ్బందితో కలిసి వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రంగంలోకి దిగి చెట్లు, కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.
మరోవైపు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో గణేష్ నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా కొనసాగాయి.
ఆపత్కాలంలో పోలీసులు చూపిన సేవా భావాన్ని స్థానికులు ప్రశంసించారు. తీవ్ర జ్వరంతో ఉన్నప్పటికీ నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించి పోలీసు సిబ్బందికి సూచనలు చేసిన ఏసీపీ మాధవి సేవలను పలు వురు అభినందించారు.

# వర్షంలోనూ తగ్గని భక్తి
## హుజురాబాద్ లో ఘనంగా గణేష్ నిమజ్జనం

- 150కిపైగా విగ్రహాల నిమజ్జనం
- భారీగా పాల్గొన్న భక్తులు

**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:** హుజురాబాద్ పట్టణంలో గణేష్ నిమజ్జన వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు వర్షం కురిసినా భక్తుల ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 150కిపైగా గణేష్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో నిమజ్జనానికి తరలించగా, వేలాది మంది భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు.
పట్టణ శివారులోని కొత్తపల్లి ఎస్సారెస్పీ కెనాల్, కాకతీయ కాలువ పరిసరాల్లో నిమజ్జనానికి పురపాలక శాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. క్రేన్లు, లైటింగ్, తాగునీరు, వైద్య శిబిరాలు, అత్యవసర సేవలను అందుబాటులో ఉంచారు. కాకతీయ కాలువ వద్ద తొలి గణేష్ విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ రోంటాల సుహాసిని ప్రారంభించి స్వయంగా నిమజ్జనం చేశారు.









**నిమర్జనం కోసం వచ్చే భక్తులకు భద్రత ఏర్పాట్లు..ఏ సీ పీ మాధవి**
భక్తుల భద్రత కోసం ఏసీపీ వీ. మాధవి, టౌన్ సీఐ కరుణాకర్, రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంతోపాటు సీ సీ కెమెరాల ద్వారా పరిస్థితిని పర్యవేక్షించ, నిమజ్జన ప్రాంతాల్లో గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బంది, విపత్తు నిర్వహణ బృందాలు, విద్యుత్ శాఖ సిబ్బందిని అందుబాటులో ఉంచారు.

**అంబేద్కర్ కూడలి వద్ద నిమజ్జన కమిటీ**
నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి, పులుకుర్తి రాజేందర్ ఆధ్వర్యంలో ఆర్కెస్ట్రా కార్యక్రమం నిర్వహించారు. గణేష్ విగ్రహాలతో వచ్చే వాహనాలు, ఉత్సవ కమిటీలకు స్వాగతం పలికి సత్కరించి మెమెంటోలు అందజేశారు. నిమజ్జన కార్యక్రమం సజావుగా సాగేందుకు కమిటీ సభ్యులు ఎప్పటికప్పుడు అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిమజ్జన కమిటీ అధ్యక్షుడు బుర్ర నటరాజ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణుదాస్ గోపాల్ రావు, గౌరవ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సలహా దారులు కల్లెపు సుధాకర్‌రెడ్డి, మంచికట్ల మురళి, గుంటి శ్రీనివాస్, కన్ను దొరై రాజ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జలకుమారి, తహసీల్దార్ నరేందర్, మున్సిపల్ కమిషనర్ కిషన్, కౌన్సిలర్లు, సీఐలు కరుణాకర్, శ్రీనివా స్, టౌన్ ఏఈ శ్రీనివాస్, రూరల్ ఏఈ రమేష్, విద్యుత్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కాయిత రాములు, కార్యదర్శి కామిని రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుతో 20 ఇళ్లలో విద్యుత్ పరికరాలు దగ్ధం



**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:** హుజురాబాద్ పట్టణంలోని గాంధీనగర్ 23వ వార్డులో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. స్థానికుడు పైడాకుల సురేష్ ఇంటిపై పిడుగు పడటంతో భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోగా, ఇంట్లోని విద్యుత్ మీటర్, టీవీ, ఫ్రిజ్, ఫ్యాన్లు, కూలర్లు దగ్ధమయ్యాయి. కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. పిడుగుపాటు ప్రభావంతో పరిసరాల్లోని మరో 20 ఇళ్లలో విద్యుత్ వైరింగ్‌తో పాటు టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు తదితర పరికరాలు దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న 23వ వార్డు కౌన్సిలర్ తూర్పాటి లక్ష్మి దుర్గరాజు ఘటన స్థలాన్ని పరిశీలించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. భారీగా ఆస్తి నష్టం జరిగినందున ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని బాధితులు కోరారు.

# విద్యార్థుల కోసం
## ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం

**వికారాబాద్ జోర్దార్ ప్రతినిధి:** వికారాబాద్ డిపో పరిధిలోని ప్రతి గ్రామానికి పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. వికారాబాద్ నుంచి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు రోజూ సుమారు 40 వేల మంది ప్రయాణికులకు బస్సు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం, ఇతర ప్రయాణికుల ద్వారా డిపోకు రోజుకు సుమారు రూ. 12 లక్షల వరకు ఆదాయం వస్తున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు.

# నిమజ్జనం వీడుకోలు



కం॥ బొజ్జ గణపతయ్య నిను, ని
 మజ్జన మొనరింతు, రేల మానవులంతా
సజ్జను లీ పని చేయగ ముజ్జగముల వాసు
లెట్లు మూసిరి నోళ్లన్.
కం॥ నవరాత్రులు సవనములా
భువిపై నొనరించిపూజ భూజనమంతా!
 భవదీయులె తుదకుయిలా అవమానిం
చేరటంచు. అనుకొందునయా.
కం॥ వీడుకోలు, విన్యాసము
వేడుకగా, చేతురేల
 వేదన లేకన్
వాడుకగా వచ్చెద, వే
 డుకనుచునమ్మి జనులు
విడుతురు నీటన్.
కం॥ వచ్చే కాలములో,నీ
 విచ్చేవని శాంతి, కోరివేడుచునుంటిన్ హెచ్చెడి
సంతసముతొ, నీ విచ్చేసెడి నాడు, నిన్ను
విడువగణేశా.



**ఎన్.బాలరాజు-రసస్రవంతి**
**వేములవాడ-7075505464.**

# తాండ్రపాడు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:** జోగులాంబ గద్వాల్ జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమంలో భాగంగా తాండ్రపాడు పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధు ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బంది విద్యార్థులకు బ్లడ్ గ్రూప్, హిమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. కంటి, దంత సమస్యలను గుర్తించి అవసరమైన చికిత్సతో పాటు తగిన సూచనలు అందించారు. బాలికలకు రుతుస్రావ సంబంధిత సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన సలహాలు, చికిత్స అందించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడమే 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వైద్య సిబ్బంది తెలిపారు.



# కొత్త బస్టాండ్ ఎదుట ప్రమాదకరంగా రహదారి గుంతలు



**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:** జోగులాంబ గద్వాల్ పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నెల రోజుల క్రితం కుళాయి పైపులైన్ లీకేజీ మరమ్మతుల అనంతరం రోడ్డును సక్రమంగా పూడ్చకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు తెలిపారు. రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో వాహనదారులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలకు అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి గుంతను పూడ్చి రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

# రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో
## బెల్లంపల్లి విద్యార్థుల ప్రతిభ

**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి:** బెల్లంపల్లి వేణు ఉషు కుంగ్‌ఫూ కరాటే విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటి బంగారు, వెండి పతకాలు సాధించారు. ఈ నెల 20న మంచిర్యాల జిల్లా సోమగూడెంలో జరిగిన పోటీల్లో కటాస్ విభాగంలో ఏ. హరిల్ బంగారు పతకం, కే. ప్రియదర్శిని, దాముక అవంతిక వెండి పతకాలు సాధించారు.
స్పారింగ్ విభాగంలో డి. మనీష్ బంగారు పతకం, ఏ. హర్షిత్ రాణి, దాముక అవంతిక, డి. బిందు వెండి పతకాలు సాధించారు.
ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు గెల్లి రాజలింగు, ప్రధాన కార్యదర్శి బోగే కరుణాకర్, మాస్టర్ టీ. ప్రసాద్ విద్యార్థులను అభినందించారు.



# అయిజ ఎంపీడీవోగా గడ్డం కృష్ణయ్య బాధ్యతలు స్వీకరణ



**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:** అయిజ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) గడ్డం కృష్ణయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు.
ఇప్పటివరకు సిద్దిపేట జిల్లా కోహెడ ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ఆయన బదిలీపై అయిజకు వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.
మండల అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని కృష్ణయ్య తెలిపారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# గణేష్ నిమజ్జనం విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

■ మున్సిపల్ చైర్ పర్సన్ రోంటాల సుహాసిని



**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, విజయవంతంగా ముగియడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు పట్టణ ప్రజలకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు నిమజ్జన వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయడంఅభినందనీయమన్నారు.నిమజ్జన ఏర్పాట్లలో సహకరించిన గణేష్ ఉత్సవ కమిటీలు, మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, వైద్య, విద్యుత్ శాఖల సిబ్బందితో పాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, మీడియా ప్రతినిధులు, యువతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# బై బై గణేశా.. ఘనంగా నిమజ్జనం

**హసన్‌పర్తి,జోర్దార్ ప్రతినిధి:**వస్తా వస్తా పండుగ తెచ్చావు.. వెళ్తూ వెళ్తూ జ్ఞాపకాలను ఇచ్చావు.. మళ్లీ నీకోసం ఎదురుచూస్తూ ఉంటాం.. బై బై గణేశా అంటూ భక్తులు గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. 66వ డివిజన్ హసన్ పర్తిలో గోల్డెన్ స్టార్ యూత్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణేశుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తిశ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం



చేపట్టారు.నాగుల సంధ్యారాణి--నాగేందర్ దంపతులు గణేశుడి విగ్రహాన్ని నిర్వాహకులకు అందించారు.

కాలనీ వాసులు బ్యాండ్ వాయిద్యాల నడుమ ఆటపాటలు,నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొని గణనాథుడిని గంగమ్మ ఒడికి సాగనంపారు. నవరాత్రుల సందర్భంగా మండపం వద్ద ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించడం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

గరిగె కొమురమ్మ కుటుంబ సభ్యులు భక్తులకు పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు.నిమజ్జన కార్యక్రమంలో ఉప్పల రవి, దాది రాజు, సంపత్, రాజేశ్వర్, వేణు, యుగేందర్,కుమార్, కన్నయ్య,శ్రీనివాస్,గరిగె శ్రీనివాస్,రాకేష్,రాజు, సురేందర్, రమణ కుమార్, మహిళా భక్తులు రజినీ, సింధూజ,కళ్యాణి,సరోజన, సమ్మక్క,సాంబలక్ష్మీ, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరం

**వరంగల్ జోర్దార్ ప్రతినిది:**వరంగల్ జిల్లాలో 1 నుంచి 18 ఏళ్ల వయస్సు గల దివ్యాంగ, ప్రత్యేక అవసరాల విద్యార్థులకు సహాయ ఉపకరణాల గుర్తింపు, నిర్ధారణ శిబిరాన్ని ఈ నెల 26న నిర్వహించనున్నారు. శంభునిపేటలోని జియచ్ యస్ పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు శిబిరం ప్రారంభమవుతుంది.
జిల్లాలోని 13 మండలాలకు చెందిన అర్హులైన విద్యార్థులు శిబిరానికి హాజరై నిర్ధారణ ప్రక్రియలో పాల్గొనాలని అధికారులు కోరారు. పరీక్షలు నిర్వహించి,అర్హులకు నిబంధనల ప్రకారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అవసరమైన సహాయ ఉపకరణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటారు.
విద్యార్థులు ఆధార్, సదరం సర్టిఫికెట్, రేషన్ కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రం,రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ తీసుకురావాలని అధికారులు సూచించారు.

వివరాలకు జిల్లా సమ్మిళిత విద్యా సమన్వయకులు డా. కె. శ్రీనివాస్‌ను **9848878455** నంబర్‌లో సంప్రదించవచ్చు.

# రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా నర్రా శ్రీనివాస్ రెడ్డి

■ రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్‌గా నర్రా శ్రీనివాస్ రెడ్డి

**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:**సింగపూర్ రైతు వేదికలో హుజురాబాద్ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది పాలకవర్గ సభ్యులు నర్రా శ్రీనివాస్ రెడ్డిని నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, సీఎస్‌ఏ ప్రతినిధులు, ఏఈఓ సౌమ్య పాల్గొని రైతుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.
సంఘంలో ప్రస్తుతం 752 మంది సభ్యులు ఉండగా, సు మారు రూ.30 లక్షల నిధులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# నిమజ్జనం చేయనిచ్చేది లేదు




పండగపూటే నన్ను బతకమంటున్నారా
అలా అయితే ఆ దేవుణ్ణి
నిమజ్జనం చేయనిచ్చేది లేదు
ఎందుకంటే నాకింకా బతకాలని ఉంది

ఆగండి ఆగండి
ఆ దేవదేవుణ్ణి సాగదోలేముందు
నన్ను ఆయనతో ముచ్చట పెట్టుకొనివ్వండి
వినాయకుడి సాక్షిగా
ఆయన సందిట్లో...పందిట్లో...
మీరు చేసిన యాక్షన్ను
నన్ను ఏకరువు పెట్టుకోనీయండి

ఒక్కపూట అన్నదానంతో
తీరిపోయేదా నా ఆకలి
అలాగే ఒక్కపూట బంతిబోజనంలో
బలిసినోడి పక్కన కూచుంటే
తొలగిపోయే అస్పృశ్యతా కాదు
అలాయ్ బలాయ్ ఉత్సవాల్లో
నన్ను నువ్వు నాటకీయంగా హత్తుకున్నపుడు
నీ వంటికంటుకున్న అత్తరు
నా కుత్తుకల జొచ్చి ఊపిరాడకుంట చేసిందే కాని
ఊరిలో మన ఉనికిని సమానమని
చాటింపు చేసే సాహసం చేయలేక పోయింది

దేవుడు వుంటేనో...
ఊరేగింపు, ఉత్సవాల్లోనో...
నువ్వు నన్ను అలుముకుంటానంటే
కష్టమో సుఖమో...
నా నెత్తిన దేవున్నైనా ఎత్తుకుంటా...
లేకుంటే నేనైనా దేవునిగా మారిపోతా...

**రాపాక శ్రీనివాస్**

# పద్మశాలి సంఘం నూతన కమిటీ సభ్యులకు ఘన సన్మానం



**ఆదిలాబాద్,జోర్దార్ ప్రతినిది:**కేఆర్కే కాలనీలోని శివ మార్కండేయ గణేష్ మండపం వద్ద పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా, తాలూకా పద్మశాలి సంఘం కమిటీ సభ్యులను కేఆర్కే కాలనీ పద్మశాలి సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో సంఘం నాయకులు దాసరి ఆశన్న, కుర్ర నరేష్, ఎనగందుల రమణయ్యతో పాటు పలువురు కులబంధువులు పాల్గొన్నారు.

# పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి




**జోగులాంబ గద్వాల జోర్దార్ ప్రతినిధి:**ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రైతులకు న్యాయం చేయాలని పెండింగ్ ప్రాజెక్టుల సాధన సమితి అలంపూర్ తాలూకా జేఏసీ చైర్మన్ వై.రామ్మోహన్ డిమాండ్ చేశారు. మానవపాడు మండల కేంద్రంలో రైతులతో కలిసి పాదయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్‌ఎల్‌ఐ నీటిని నల్గొండకు తరలించే దిండి లిఫ్ట్ పథకాన్ని రద్దు చేయాలని, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల నుంచి ఉండవల్లి, మానవపాడు, అలంపూర్ మండలాలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని కోరారు. ఈ నెల 27న ఉల్వార నుంచి కల్వకుర్తి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నాయకులు దుబ్బన్న నాగరాజు, జగ్గుల శ్రీనివాసులు, సర్దార్, ప్రకాశం, బీచుపల్లి, రామన్న, మద్దిలేటి, రాజు, రాజ శేఖర్, గిడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎంబిబిఎస్ సీటు సాధించిన ఆనందం ఎంతోకాలం నిలవకుండానే.. పావని మృతి

**జోగులాంబ,జోర్దార్ ప్రతినిధి:**జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గం అయిజ మున్సిపాలిటీ 9వ వార్డు మాలపేట కాలనీకి చెందిన మాల చింతలన్న కుమార్తె మాల పావని (20) గురువారం సాయంత్రం హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు.చిన్ననాటి నుంచి పట్టుదలతో చదువుకున్న పావని ఇటీవలే ఎంబీబీఎస్ సీటు సాధించారు. వైద్య విద్యను పూర్తి చేసి భవిష్యత్తులో డాక్టర్‌గా ప్రజలకు సేవ చేయాలనే ఆమె కలలు సాకారం అవుతున్న సమయంలోనే మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తులను తీవ్ర విషాదంలోకి నెట్టింది.
పావని మృతితో మాలపేట కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. పావని




అంత్యక్రియలు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు అయిజ పట్టణంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# పులి దాడిలో పశువులు మృతి బాధిత రైతుకు స్వప్న కుమారి పరామర్శ



**చింతూరు,జోర్దార్ బ్యూరో:**గంగవరం మండలం మర్రిపాలెం గ్రామానికి చెందిన రైతు రాజారెడ్డికి చెందిన నాలుగు పశువులను బుధవారం రాత్రి పులి దాడి చేసి చంపింది. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి బాధిత రైతును పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని సబ్ డీఎఫ్ఓ సుబ్బారెడ్డిని ఫోన్‌లో కోరారు.
నిబంధనల ప్రకారం పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.
మృతి చెందిన పశువులకు అటవీశాఖ ఆధ్వర్యంలో దహన సంస్కారాలు నిర్వహించారు.
చుట్టుపక్కల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్వప్న కుమారి సూచించారు.

# భారీ వర్షంతో హుజురాబాద్‌లో సందడి

■ గణేష్ నిమజ్జనానికి గంగమ్మ స్వాగతం

**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్ నియోజకవర్గంలో గురువారం భారీ వర్షం కురవడంతో పల్లెలు, పట్టణాలు వర్షపు జల్లులతో సందడిగా మారాయి. గణేష్ నిమజ్జన వేడుకల సమయంలో వర్షం కురవడంతో భక్తులు, యువత ఉత్సాహంగా నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా యువత తీన్మార్ స్టెప్పులతో సందడి చేశారు.గణేష్ నిమజ్జనానికి తరలిస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగల విషయంలో నిర్వాహకులు, యువత అప్రమత్తంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ సూచించారు. నిమజ్జన



కార్యక్రమాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. భారీ వర్షం కురవడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

# రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్లక్ష్యమేనా?

■ ఆహార నాణ్యతపై అసంతృప్తి.. మరుగుదొడ్ల పరిశుభ్రతపై తీవ్ర ఆగ్రహం

■ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆకస్మిక తనిఖీతో లోపాలు బహిర్గతం

■ తనిఖీలు జరుగుతున్నా.. స్పోర్ట్స్ స్కూల్ వ్యవస్థ ఎందుకు మారడం లేదు?

**కరీంనగర్, జోర్దార్ ప్రతినిధి:**క్రీడా ప్రతిభను వెలికి తీసి రాష్ట్ర, జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాల్సిన రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థులకు అందుతున్న వసతులపై ప్రశ్నలు తలెత్తు తున్నాయి.
పాఠశాలలో వంటశాల పరిస్థితి, ఆహార నాణ్యత, మరుగుదొడ్ల పరిశుభ్రతపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యశ్వంత్ సింగ్ ఆకస్మిక తనిఖీలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం చర్చనీ యాంశంగా మారింది. వంటశాల, స్టోర్‌రూమ్, వసతి గదులు, మరుగుదొడ్లు, భోజన ఏర్పాట్లను పరిశీలించిన ఆయన.. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.నాణ్యత లేని కూరగాయలు, ఆహార పదార్థాల విషయంలోనూ ఆయన సిబ్బందిని ప్రశ్నించిన ట్లు అధికారులు తెలిపారు.




**మరుగుదొడ్ల పరిస్థితిపై ప్రశ్నలు**

విద్యార్థులు ప్రతిరోజూ వినియోగించే మరుగుదొడ్లు, స్నానపు గదుల పరిశుభ్రతపై కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. విద్యార్థుల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న పరిశుభ్రత అంశంలో ఇంత నిర్లక్ష్యం ఎలా చోటు చేసుకుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పాఠశాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉందా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**తనిఖీలతోనే మార్పు వస్తుందా?**

స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, సురక్షితమైన వసతి, వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదే. అయితే ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీ చేసే వరకు సమస్యలు బయటకు రాకపోవడం పర్యవేక్షణ వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

గతంలోనూ తనిఖీలు, సూచనలు జరిగి ఉంటే.. పరిస్థితుల్లో శాశ్వత మార్పు ఎందుకు కనిపించడం లేదన్న చర్చ సాగుతోంది. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన సీనియర్ సివిల్ జడ్జి వారి సమస్యలను తెలుసుకున్నారు. వసతి, భోజనం, పరిశుభ్రత, వైద్య సేవలకు సంబంధించిన అంశాలను విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. గుర్తించిన లోపాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని యశ్వ ంత్ సింగ్ పేర్కొన్నారు.

ఇకనైనా కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా.. గుర్తించిన లోపాలపై బాధ్యులను గుర్తించి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేలా పటిష్టమైన పర్యవేక్షణ ఉంటుందా? అన్నదే ప్రశ్న.

# ఒక పలకరింపు చాలు..!

స్నేహపూరితమైన చిరుగాలి స్పర్శతో
తనువంతా పులకరిస్తుంది
ఒక ఆత్మీయమైన పలకరింపు చాలు
మనసంతా ఉత్తేజంతో ఉరకలేస్తుంది
రోజులు గడిచిపోయినట్టుగానే
దుఃఖాలు కూడా కనుమరుగవుతాయి
అన్ని దారులు ఒకటిగానట్టే
అన్ని పరిచయాలు ఒకటి కావు
కొన్ని మంచులా కరిగిపోతాయి
కొన్ని శిఖరంలా నిలబడుతాయి
సాకులతో గమనాన్ని ఆపద్దు
జీవనానందాన్ని ఒదులుకోవద్దు..!



**గోపగాని రవీందర్
9440979882**

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

# యూపీఐ చార్జీలు తిరోగమన చర్య

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ఫేస్ భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి వెన్నెముకగా నిలిచింది. యూపీఐ లావాదేవీల పరంగా ప్రపంచ రికార్డులు సృష్టించింది. చిన్న దుకాణాల నుంచి పెద్ద మాల్స్ వరకు, వీధి వ్యాపారుల నుంచి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల వరకు, నగదు అవసరం లేకుండా, వెంటనే, ఉచితంగా లావాదేవీలు చేయగలిగే వేదికగా ఇది ఎదిగింది. ఈ విస్తరణకు "జీరో ఎండీఆర్" (మర్చంట్ డిస్కౌంట్ రేట్) విధానం దోహద పడింది. 2020 నుంచి యూపీఐ, రూపే డెబిట్ కార్డులపై ఎండీఆర్‌ను సున్నా చేసి, బదులుగా ప్రభుత్వం చిన్న వ్యాపారుల తక్కువ విలువల లావాదేవీలకు సబ్సిడీలు ఇచ్చింది. 2021 నుంచి 2025 వరకు ఈ సబ్సిడీ మొత్తం సుమారు రూ.8,730 కోట్లు. దీని ఫలితంగా యూపీఐ లావాదేవీల విలువ కొన్ని ఏళ్లలోనే రూ.21.3 లక్షల కోట్ల నుంచి రూ.260.56 లక్షల కోట్లకు దూసుకెళ్లింది.




**రుసుములతో యూపీఐ చెల్లింపులు**

అక్టోబర్ 15, 2026 నుంచి నూతన ఎండీఆర్ విధానం ప్రారంభం కానుంది.

**కొత్త విధానం ప్రకారం:** వ్యక్తి నుంచి వ్యక్తికి (పి టు పి) జరిగే యూపీఐ చెల్లింపులకు ఎలాంటి రుసుము లేదు. వ్యాపారులకు రూ.2,000 వరకు జరిగే చెల్లింపులు సాధారణంగా ఉచితంగానే కొనసాగుతాయి. చిన్న వ్యాపారుల్లో నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ ద్వారా స్వీకరించే కొన్ని వర్గాలకు "జీరో ఎండీఆర్" కొనసాగుతుంది. రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట మర్చంట్ లావాదేవీలపై 0.4శాతం ఎండీఆర్. రూ.75,000 పైబడిన లావాదేవీల కు గరిష్ఠంగా రూ.300 పరిమితి. రైల్వేలు, ఇంధనం, టెలికాం వంటి రంగాలకు ప్రత్యేకంగా రూ.5 ఫ్లాట్ రేటును ప్రభుత్వం ప్రకటించింది. అంటే, ఈ ఎండీఆర్‌ను నేరుగా వినియోగదారుడి నుంచి వసూలు చేయరాదు. ఎం డి ఆర్ ద్వారా వసులయ్యే మొత్తం బ్యాంకులు, పేమెంట్ యాప్స్, సర్వీస్ ప్రొవైడర్ల మధ్య పంచబడుతుంది.

యూపీఐ మౌలిక సదుపాయాలు, సైబర్ సెక్యూరిటీ, మోసాల నివారణ, టెక్నాలజీ అప్‌గ్రేడ్ల కోసం సుస్థిర ఆర్థిక వనరును కల్పించడం కోసమే ఈ చార్జీలు విధిస్తున్నామని ప్రభుత్వం ప్రకటిస్తోంది. అంతేకాకుండా మొత్తం పర్సన్ టు మర్చంట్ లావాదేవీలలో దాదాపు 96శాతం ఈ మార్పుతో ప్రభావితం కావని కేంద్రం చెబుతోంది. అయితే 4 శాతం లావాదేవీల పరిమాణం అత్యధికం కావడం ఇక్కడ గమనార్హం. యూపీఐ మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ.8,700 కోట్ల సబ్సిడీ ఇస్తూ ఈ వ్యవస్థను నిరంతరం పూర్తిగా ఉచితంగా నడపడం సాధ్యం కాదని ప్రభుత్వం వాదిస్తూ యూపీఐ చార్జీలను సమర్థిస్తోంది.

**కళ్ళకు కడుతున్న వాస్తవాలు**

యూపీఐ వ్యవస్థలో ఆర్బిఐ, ఎన్పిపిఐ, బ్యాంకులు మరియు ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ పే వంటి పేమెంట్ యాప్ లు భాగస్వాములుగా ఉన్నాయి.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2026 ఆర్థిక సంవత్సరంలోనే సుమారు రూ.3 లక్షల కోట్ల మిగులును ప్రభుత్వానికి బదిలీ చేసింది. సుమారు 750 కి పైగా బ్యాంకులు తమ వార్షిక లాభాల్లో వాటాగా వేల కోట్ల రూపాయలను ప్రభుత్వానికి అందజేశారు.

యూపీఐని నిర్వహించే నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ సి పి ఐ)లాభాపేక్ష లేని సంస్థ అయినప్పటికీ, గత సంవత్సరంలోనే ప్రభుత్వానికి రూ.1,000 కోట్ల పన్నులు చెల్లించింది.

ఈ నేపథ్యంలో యూపీఐ వ్యవస్థ నిర్వహణ కోసం ప్రభుత్వం చేస్తున్న రూ.8,000 కోట్ల వ్యయాన్ని భారంగా చూడడం సరికాదు. ఫైనాన్షియల్ వ్యవస్థ నుంచి ప్రభుత్వానికి, బ్యాంకులకు వస్తున్న భారీ లాభాలను దృష్టిలో పెట్టుకుని యూపీఐని ఉచిత ప్రజాప్రయోజన సేవగా కొనసాగించాల్సిన అవసరం ఉంది.

**విదేశీ ఒత్తిళ్లు**

2016 నోట్ల రద్దు తరువాత ప్రభుత్వం డిజిటల్ లావాదేవీలను బలంగా ప్రోత్సహించింది. ఉచిత, వేగవంతమైన, సులభమైన చెల్లింపు వ్యవస్థగా యూపీఐ పౌరుల అలవాటులో బలంగా స్థిరపడింది. ఇప్పుడు అదే వ్యూహానికి విరుద్ధంగా కనిపించేలా ఎండీఆర్ విధించడం

చూస్తే విదేశీ ఒత్తిడిల ప్రభావం కనిపిస్తోంది. యూపీఐ ఉచితంగా లభించడం వల్ల విదేశీ కార్డ్ నెట్వర్క్‌ల (వీసా, మాస్టర్‌కార్డ్ వంటి సంస్థలు) వ్యాపారానికి దెబ్బ తగిలింది. మరోవైపు గూగుల్ పే, ఫోన్‌పే వంటి ప్లాట్‌ఫారమ్‌లు డేటా మైనింగ్, ప్రకటనల ద్వారా లాభాలు పొందుతున్నప్పటికీ, ఇంకా మోనిటైజేషన్ అవకాశాలు పెంచాలని చూస్తున్నాయి.

భారత డిజిటల్ పేమెంట్ పాలసీలో భారత్ -- అమెరికా వాణిజ్య టారిఫ్ లు , గ్లోబల్ రోల్స్, జియో పాలిటిక్స్ ప్రభావం సైతం కనబడుతోంది. భారత రష్యా చమురు సంబంధాలను సాకుగా చూపి అమెరికా టారిఫ్ ల బెదిరింపులకు పాల్పడుతున్నది. ఈ క్రమంలో వీసా ,మాస్టర్ కార్డ్ లాంటి అమెరికన్ కార్డు కంపెనీలకు లబ్ధి చేకూరుస్తూ అమెరికాను ప్రసన్నం చేసుకునే చర్యగా యూపీఐ రుసుముల వ్యవహారం చూడబడుతుంది.

**మరొక పరోక్ష పన్ను**

జీఎస్టీ రూపంలో కేంద్ర ప్రభుత్వం ప్రజల నుండి లక్షల కోట్ల రూపాయలు పన్ను వసూలు చేస్తుంది. పెట్రోలు, లిక్కర్ల నుండి పన్నులు రాబడుతుంది. ఇప్పుడు ఎండిఆర్ రుసుముల పేరిట కొత్తగా మరొక పన్నుకు తెరలేపింది. ఇది దొడ్డి దారిలో ప్రజలపై రుద్దబడిన మరొక పరోక్ష పన్ను మాత్రమే అవుతుంది.

**ముందున్న అసలు పరీక్ష:**

ఎండీఆర్ చెల్లింపులు కారణంగా ఇప్పటికే తక్కువ లాభ మార్జిన్లతో పనిచేస్తున్న రంగాలకు ఇది పెద్ద భారమవుతుంది. మొబైల్ రిటైలర్ల లాభ మార్జిన్ 0.75--1.5శాతం మధ్యే ఉందని, ఎఫ్ఎంసీజీ, కిరాణా వ్యాపారాల్లో నికర మార్జిన్ 1.5--2శాతం మాత్రమేనని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. పెట్రోల్ బంక్ డీలర్ల లాభ మార్జిన్ సుమారు 0.5 శాతం మాత్రమే. ఈ పరిస్థితిలో అదనపు ఎండీఆర్ చెల్లించడం కష్టమని, రూ.2,000 పైబడిన యూపీఐ చెల్లింపులకు నగదు మాత్రమే స్వీకరిస్తామని ఆంధ్ర ప్రదేశ్ ,పంజాబ్ లోని కొందరు డీలర్లు ఇప్పటికే ప్రకటించారు. ఆర్థిక శాస్త్ర పరంగా చూస్తే, వ్యాపారి భరించిన ప్రతి అదనపు ఖర్చు అంతిమంగా వినియోగదారుడు నుండే వసూలు చేయబడుతుంది. ఆ మేరకు వ్యాపారులు ధరలు పెంచి అమ్మకాలు కొనసాగిస్తారు. రుసుముల భయంతో ప్రజలు క్రమంగా నగదు లావాదేవీల వైపు మొగ్గు చూపితే దేశ ఆర్థిక వ్యవస్థ పై గట్టి ప్రభావం పడుతుంది. నోట్ల రద్దు తరహాలో ఇది మరో తిరోగమన చర్యగా దేశ ఆర్థిక చరిత్రలో నిలుస్తుంది. దేశంలో డిజిటల్ పేమెంట్స్ విప్లవం సాధించిన ఘనత తమదే అని భుజాలు చరుచుకునే బిజెపి ప్రభుత్వం ఎండిఆర్ రుసుముల వ్యవహారంతో యూపీఐ పథకం అటకెక్కి ప్రతిష్ట కోల్పోవడం ఖాయం.



**నోముల శ్రీనివాస్ రెడ్డి**
**(అడ్వకేట్)/9441357274**

# రిటైర్డ్ డీసీపీ సుదర్శన్ గౌడ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**హసన్ పర్తి, జోర్దార్ ప్రతినిధి:** రిటైర్డ్ డీసీపీ సుదర్శన్ గౌడ్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గురువారం భీమారంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. పోలీస్ శాఖలోబాధ్యతాయుతమైన పదవుల్లో పనిచేసి ప్రజలకు విశేష సేవలందించిన తన బ్యాచ్‌మేట్, మిత్రుడు సుదర్శన్ గౌడ్‌ను ఆప్యాయంగా కలుసుకున్న ఎమ్మెల్యే నాగరాజు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కొంతసేపు ముచ్చటిస్తూ ప్రస్తుతం తీసుకుంటున్న జాగ్రత్తలు, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్‌తో తనకున్న అనుబంధాన్ని ఎమ్మెల్యే గుర్తుచేసుకున్నారు. ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి, అవసరమైన సమయంలో అండగా ఉంటానని, సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు.

# జోర్దార్ ఎఫెక్ట్..

## డీపీఓ కార్యాలయానికి చేరిన ల్యాప్‌టాప్

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

## పెద్దపల్లి డిపిఓ కార్యాలయ లాప్టాప్ అడ్రస్ ఎక్కడ?

- వార్తకు స్పందించిన జిల్లా యంత్రాంగం.. ఆరు నెలలుగా పెండింగ్‌కు తెర
- రిటైర్డ్ డీపీఓ నుంచి అధికారులకు ల్యాప్‌టాప్ అందజేత
- సమస్యను వెలుగులోకి తెచ్చిన జోర్దార్‌కు అధికారుల కృతజ్ఞతలు

**పెద్దపల్లి జోర్దార్ ప్రతినిధి:** పెద్దపల్లి డీపీఓ కార్యాలయంలో ల్యాప్‌టాప్ అడ్రస్ ఎక్కడ అంటూ జోర్దార్ దినపత్రికలో గురువారం ప్రచురించిన వార్తకు స్పందన లభించింది. వార్త వెలువడిన అనంతరం సంబంధిత ల్యాప్‌టాప్ పెద్దపల్లి పంచాయతీ కార్యాలయ అధికారులకు చేరింది. గత ఆరు నెలలుగా ల్యాప్‌టాప్ రిటైర్డ్ డీపీఓ వీర బుచ్చయ్య వద్ద ఉన్నట్లు వచ్చిన సమాచారంపై జోర్దార్ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. వార్త ప్రచురితమైన రోజే ఆయన ల్యాప్‌టాప్‌ను కార్యాలయ అధికారులకు అందజేసినట్లు సమాచారం.

**అధికారుల్లో హర్షం**

ల్యాప్‌టాప్ తిరిగి కార్యాలయానికి చేరడంతో సంబంధిత అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యాలయానికి సంబంధించిన పరికరం తిరిగి అందుబాటులోకి రావడంతో పెండింగ్‌లో ఉన్న అంశానికి పరిష్కారం లభించినట్లయింది.

ప్రజా సమస్యలు, ప్రభుత్వ కార్యాలయాల్లోని లోపాలను వెలుగులోకి తీసుకువచ్చే విధంగా వార్త ప్రచురించిన జోర్దార్ దినపత్రికకు అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎఫ్ఎల్ఎన్ పనిభారం తగ్గించాలి

- ఉపాధ్యాయులపై అదనపు బాధ్యతలు తగ్గించాలి.. బోధనకే ప్రాధాన్యం ఇవ్వాలి
- వీణవంక మండల విద్యాధికారికి ఉపాధ్యాయుల వినతి



**(వీణవంక, జోర్దార్ ప్రతినిధి:)** పాఠశాలల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం కార్యక్రమం (ఎఫ్ఎల్ఎన్) అమలులో భాగంగా ఉపాధ్యాయులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించాలని వీణవంక మండలంలోని ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు కోరారు. గురువారం భోజన విరామ సమయంలో మండల విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు.

ఎఫ్ఎల్ఎన్ అమలుతో పాటు వివిధ అంతర్జాల పనులు, హాజరు నమోదు, వివిధ పాఠశాలల వివరాల నమోదు, పాఠ్యపుస్తకాలు--పని పుస్తకాల నిర్వహణ, మూల్యాంకనం, అభ్యసన ఫలితాల నమోదు, పునరభ్యసన, బోధనోపకరణాల తయారీ, పాఠ్య ప్రణాళికలు, వివిధ నివేదికలు, రికార్డులు, సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు వంటి అనేక పనులను ఉపాధ్యాయులు నిర్వహించాల్సి వస్తోందని తెలిపారు.

**బోధనకు సమయం కరువు**

అనేక పాఠశాలల్లో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తుండగా, వారికి అదనపు బాధ్యతలు కూడా అప్పగించడం వల్ల పనిభారం మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. మరోవైపు విద్యాశాఖ అధికారులు, పర్యవేక్షణ బృందాల నిరంతర తనిఖీలతో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. దీనివల్ల విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేందుకు అవసరమైన సమయం తగ్గిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఒత్తిడి తగ్గించే చర్యలు చేపట్టాలి**

ఇటీవల జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం చిల్వకోడూరుకు చెందిన ఓ ఉపాధ్యాయుడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బాధాకరమని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాఠశాలల్లో పనిచే స్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై అదనపు పనిభారాన్ని తగ్గించి, వారి మానసిక ఒత్తిడిని తగ్గించే చర్యలు తక్షణమే చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయులను ప్రధానంగా బోధన కు సంబంధించిన విధులకే పరిమితం చేసి, అదనపు పనిభారాన్ని తగ్గించేలా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని మండల విద్యాధికారిని వారు విజ్ఞప్తి చేశారు.

# హుజురాబాద్‌లో ఉపఎన్నికపై ఉత్కంఠ!

- ఎథిక్స్ కమిటీ నిర్ణయం కోసం ఎదురుచూపులు..
- ఖైరతాబాద్‌తో పాటు హుజురాబాద్‌పైనా రాజకీయ వర్గాల్లో చర్చ



**(కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి)** తెలంగాణ రాజకీయాల్లో మరో ఉపఎన్నిక అంశం చర్చనీయాంశంగా మారింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతను సుప్రీంకోర్టు సమర్థించడంతో ఆ స్థానానికి ఉపఎన్నికకు మార్గం సుగమమైంది. ఇదే సమయంలో కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహారం కూడా అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ పరిశీలనలో ఉండటంతో హుజురాబాద్‌లోనూ ఉపఎన్నికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

**ఎథిక్స్ కమిటీ నిర్ణయంపైనే ఆసక్తి**

అసెంబ్లీలో కౌశిక్‌రెడ్డి వ్యవహారంపై ఎథిక్స్ కమిటీ విచారణ కొనసాగుతోంది. సెప్టెంబర్ 24న జరగాల్సిన విచారణను సెప్టెంబర్ 30కి వాయిదా వేసినట్లు సమాచారం. పూర్తి వీడియో దృశ్యాలు అందించాలని బీఆర్ఎస్ కోరిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

కమిటీ తుది నిర్ణయం ఏమిటి? దాని ఆధారంగా తదుపరి పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి? అన్నదే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**హుజురాబాద్‌లో అప్పుడే రాజకీయ సందడి**

ఉపఎన్నికపై అధికారిక ప్రకటన వెలువడకముందే హుజురాబాద్ నియోజకవర్గంలో వివిధ రాజకీయ పార్టీల నేతలు, ఆశావహుల కదలికలు పెరుగుతున్నట్లు చర్చ జరుగుతోంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ సహా పలు పార్టీల నేతలు నియోజకవర్గంపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే హుజురాబాద్‌లో ఉపఎన్నిక ఖరారైందని ఇప్పుడే చెప్పడం కంటే..

ఎథిక్స్ కమిటీ నిర్ణయం, తదనంతర రాజ్యాంగపరమైన పరిణామాలపై ఆధారపడి పరిస్థితి స్పష్టమవు తుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.

**ఖైరతాబాద్‌తో పాటు హుజురాబాద్‌పైనా ఉత్కంఠ**

ఖైరతాబాద్‌లో ఉపఎన్నికకు మార్గం ఏర్పడగా.. హుజురాబాద్ అంశం ఎథిక్స్ కమిటీ నిర్ణయంపై ఆసక్తిని రేపుతోంది.

దీంతో తెలంగాణలో ఉపఎన్నికల చర్చ మరోసారి ఊపందుకుంది. హుజురాబాద్ విషయంలో రానున్న పరిణామాలపై అన్ని రాజకీయ పార్టీలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాయి.

## రెండో రోజూ ప్రశాంతంగా గణేశ్ నిమజ్జనం

# నిర్వాహకులు, భక్తులు సహకరించాలి



- కలెక్టర్ సత్యశారద

**(వరంగల్ జోర్దార్ ప్రతినిధి)** వరంగల్ జిల్లాలో గణేశ్ నిమజ్జనోత్సవం రెండో రోజు కూడా ప్రశాంతంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద తెలిపారు.

నిమజ్జన ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారీగా విధులు నిర్వహిస్తూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్యారోగ్య, విద్యుత్, పారిశుధ్య శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల గకుండా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, నిమజ్జనోత్సవం ప్రశాంతంగా జరిగేందుకు గణేశ్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

# ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:** హుజురాబాద్ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో డాక్టర్ ఇందిరాదేవి మొక్కలు నాటారు.

విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా భావాన్ని పెంపొందించు కోవాలని, పర్యావరణ పరిరక్షణ, సామా జిక రుగ్మతలు, నిరక్షరాస్యత, ఆర్థిక మోసాలపై ప్రజల్లో చైతన్యం కల్పిం చడంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మల్లారెడ్డి, అధ్యాపకులు జనశీరాణి, రేణుక, సుమలత, స్వప్న, రమా, లింగారెడ్డి, ఓదెలు, నరేందర్, మహిపాల్‌రెడ్డి, సిబ్బంది, అకిన్ జహీరా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# కోట్ల బకాయిలున్నా కరుణిస్తున్న డీసీఎస్ఓ.. కరీంనగర్ పౌర సరఫరాల శాఖలో విచ్చలవిడి అవినీతి!

**-సార్టెక్స్ లేకున్నా సరే.. లంచాలు ఇస్తే చాలు: కరీంనగర్ సివిల్ సప్లై అధికారి లీలలు!**

**కరీంనగర్ జోర్దార్ ప్రతినిధి):**

కరీంనగర్ జిల్లా పౌర సరఫరాల శాఖలో అవినీతి తారస్థాయికి చేరింది. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ, రైస్ మిల్లర్లతో కుమ్మక్కై కొందరి అధికారులు అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు తీవ్రతరం అవుతున్నాయి. ముఖ్యంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వ్యవహారశైలిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల బకాయిలను పట్టించుకోకుండా, అందిన ముడుపులకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే గుసగుసలు శాఖలోనే బలంగా వినిపిస్తున్నాయి.

**కోట్ల బకాయిలపై కరుణ.. దేనికోసం?**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైస్ మిల్లర్లు పౌర సరఫరాల శాఖకు చెల్లించాల్సిన బకాయిలు కోట్లలో ఉన్నాయి. కానీ, నిబంధనలను కఠినంగా అమలు చేయాల్సిన డీసీఎస్ఓ మాత్రం ఆ మిల్లర్లపై విపరీతమైన 'కరుణ' చూపిస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి రికవరీ చర్యలు చేపట్టకపోవడంతో ప్రభుత్వ ధనం బూడిదలో పోసిన పన్నీరులా మారుతోంది. బకాయిలు చెల్లించని వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, వారికి లబ్ధి చేకూర్చేలా వ్యవహరించడం వెనుక పెద్ద ఎత్తున ఆర్థిక లావాదేవీలు నడుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.




**సార్టెక్స్ లేకున్నా.. లంచం ఇస్తే చాలు!**

?ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం మిల్లింగ్ విషయంలో క్వాలిటీ చాలా ముఖ్యం. బియ్యం నాణ్యతగా ఉండేందుకు 'సార్టెక్స్' యంత్రాలు తప్పనిసరి. అయితే, కరీంనగర్ జిల్లాలోని పలు రైస్ మిల్లులలో అసలు సార్టెక్స్ యంత్రాలే లేకపోయినా.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సమాచారం. మిల్లుల వద్ద సార్టెక్స్ లేకపోయినా పర్వాలేదు.. తమకు ముట్టజెప్పాల్సిన 'మామూళ్లు' సరిగ్గా ఇస్తే చాలనే ధోరణిలో డీసీఎస్ఓ వ్యవహరిస్తున్నట్లు విమర్శలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నాణ్యత లేని బియ్యాన్ని పీడీఎస్ కిందకు మళ్లించడానికి సహకరిస్తున్నారనే ఆరోపణలు శాఖలో కలకలం రేపుతున్నాయి.

**పట్టించుకోని పైస్థాయి అధికారులు??నిత్యం రైతుల సంక్షేమం,**

పారదర్శక పంపిణీ గురించి మాట్లాడే ప్రభుత్వ మాటలకు, కరీంనగర్ సివిల్ సప్లై శాఖలో జరుగుతున్న తంతునకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. కిందిస్థాయి సిబ్బంది నుంచి డీసీఎస్ఓ స్థాయి అధికారి వరకు ప్రతి పనికి రేట్లు ఫిక్స్ చేశారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ఎన్డీఏ లేదా విజిలెన్స్ అధికారులు స్పందించి కరీంనగర్ పౌర సరఫరాల శాఖపై సమగ్ర విచారణ జరిపితేనే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని, కోట్ల రూపాయల ప్రభుత్వ ధనం రక్షించబడుతుందని , ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# 'బీఆర్ఎస్ పార్టీకి ఇదొక గొప్ప విజయం.. మిగతా ఎమ్మెల్యేలు కూడా..'



**హైదరాబాద్** :దానం నాగేందర్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు స్పెషల్ లీవ్ ఇవ్వకుండా అడ్మిషన్ స్టేజీలోనే కొట్టివేయడం జరిగిందని బీఆర్ఎస్ తరఫు సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్ రావు స్పష్టం చేశారు. పార్టీ ఫిరాయింపు కేసులో తనను అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధించాలని కోరుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయగా.. దానం నాగేందర్‌పై అనర్హత వేసిన సుప్రీంకోర్టు.. మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని తేల్చి చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో న్యాయవాది గండ్ర మోహన్ రావు ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. నువ్వొకసారి వేరే పార్టీ నుంచి పోటీ చేసిన తర్వాత మెంబర్ ఆఫ్ లెజిస్లేటివ్ అసెంబ్లీగా నీకు అనర్హత చట్టం వర్తిస్తుందని గౌరవ సుప్రీంకోర్టు చెప్పింది. కాబట్టి దాని తర్వాత జరిగిన పరిణామాలతో సంబంధం లేదని గౌరవ సుప్రీంకోర్టు కొట్టేసింది. వారి కౌన్సిల్ వాదించడానికి ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ నాపై చర్యలు తీసుకోలేదు. నేనింకా బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నా కాబట్టి నాకు ఇంకా అనర్హత వర్తించదని అన్నారు.దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరిన 3 రోజుల్లోనే స్పీకర్ దగ్గర బీఆర్ఎస్ పిటిషన్ దాఖలు చేసిందని చెప్పా. కానీ స్పీకర్ వద్ద నుంచి సరైన స్పందన రాకపోవడంతో, హైకోర్టు, సుప్రీంకోర్టు వరకు బీఆర్ఎస్ న్యాయపోరాటం చేసిందన్నారు. దీంతో త్వరలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు రాబోతున్నాయి. బీఆర్ఎస్ మొదటి రోజు నుంచి న్యాయపోరాటం చేసింది. బీఆర్ఎస్ పార్టీకి ఇదొక గొప్ప విజయం. పార్టీ మారిన మిగతా ఎమ్మెల్యేల విషయంలో కూడా డివిజన్ బెంచ్ ఒక నిర్ణయం తీసుకోబోతుంది. వారికి కూడా ఇలాగే జరగబోతుందని ఆశిస్తున్నామన్నారు.

# కేటీపీఎస్ వద్ద ఉద్రిక్తత.. బీఆర్ఎస్ బృందాన్ని అడ్డుకున్న పోలీసులు

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 24 :**




బొగ్గు సరఫరా లేక విద్యుత్ ప్లాంట్లు వెలవెలబోతున్నాయంటూ బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వర్‌రావు బృందం గురువారం పాల్వంచ కేటీపీఎస్ సందర్శనకు వెళ్లింది. ఈ సందర్శనలో గేటు వద్దనే బీఆర్ఎస్ బృందాన్ని పోలీసులు అడ్డుకున్నారు. సుమారు గంటసేపు తోపులాట జరిగింది. పలువురు స్వల్పంగా గాయపడ్డారు. దీంతో కేవలం బృందంలోని ఐదుగురిని మాత్రమే ప్లాంట్‌లోకి అనుమతించారు. అనంతరం గేటు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ వద్దిరాజు మాట్లాడారు. చేతగాని దద్దమ్మ ప్రభుత్వంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నదన్నారు. రైతాంగం నిర్వేదంతో, బాధల్లో ఉన్నారని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తంచేశారు. వ్యవసాయానికి సాగునీళ్లు, విత్తనాలు, కరెంట్,యూరియా సక్రమంగా సరఫరా చేయకుండా ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన మండిపడ్డారు.

# మరోసారి భీమ్‌రెడ్డి ఆస్తులపై ఏసీబీ సోదాలు - రూ.1.40 కోట్ల నగదు గుర్తింపు

మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డి బినామీ ఇళ్లలో ఏసీబీ మరోసారి సోదాలు చేపట్టింది. పుప్పాలగూడతో సహా మొత్తం 8 చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. పుప్పాలగూడలో భీమ్‌రెడ్డి బినామీ కోమటి వెంకటేశ్ ఇంట్లో ఏసీబీ సోదాలు జరుగుతున్నాయి. కోమటి వెంకటేశ్ ఇంట్లో రూ.1.40 కోట్ల నగదు అధికారులు గుర్తించారు. నగదుపై ఆదాయపు పన్ను శాఖ అధికారులకు ఏసీబీ సమాచారం ఇచ్చింది. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ సోదాలు కొనసాగుతున్నాయి.విల్లా ఎలా కొన్నారు?భీమ్‌రెడ్డికి సంబంధించిన కన్‌స్ట్రక్షన్ డెవలప్‌మెంట్ కంపెనీలో ఏసీబీ సోదాలు నిర్వహించింది. భీమ్‌రెడ్డి ప్రస్తుతం నివసిస్తున్న విల్లా కొనుగోలు పైనా ఏసీబీ ఆరాతీస్తోంది. మద్యం సీసాల వ్యవహారంపై ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించింది. భీమ్‌రెడ్డి రూ.9 కోట్లకు విల్లా కొనుగోలు చేసినట్లు గుర్తించారు. విల్లా కొనుగోలుకు నిధులు ఎక్కడి నుంచి వచ్చాయనే కోణంలో దర్యాప్తు చేపట్టారు.రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తులుబినామీల పేర్లతో ఆస్తులు, నగదు లావాదేవీలపై ఏసీబీ అధికారులు ఆరా తీస్తోంది. ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారంపై గతంలో భీమ్‌రెడ్డిని ఏసీబీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. భీమ్‌రెడ్డి రూ.200 కోట్లకు పైగా అక్రమాస్తులు కూడబెట్టారని



గతంలో అధికారులు గుర్తించారు.పలు ప్రాంతాల్లో భారీగా బినామీ ఆస్తులుభీమ్‌రెడ్డి విధి నిర్వహణలో ఉండగా అక్రమ మార్గాల్లో దాదాపు రూ.150 కోట్ల విలువైన ఆస్తులను సంపాదించుకున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆయనతో పాటు బినామీల పేర్లతో 20కి పైగా చర, స్థిరాస్తులు కల్గి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. భీమ్‌రెడ్డి సంపాదించిన ఈ భారీ ఆస్తులు కేవలం ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా పలు ప్రాంతాల్లో విస్తరించి ఉన్నట్లు తేల్చారు. మణికొండ, గచ్చిబౌలి, తెల్లాపూర్, పటాన్‌చెరు, నాగోలు, మోమిన్‌పేట్, జహీరాబాద్, కర్ణాటకలోని బెంగళూరులోనూ ఖరీదైన ఆస్తులను గుర్తించారు. ఈ ఆస్తుల్లో సింహభాగం నేరుగా ఆయన పేరు మీద కాకుండా బినామీల పేర్లపై కొనుగోలు చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. ఏసీబీ దర్యాప్తులో భారీగా బినామీ ఆస్తులు బయటపడటంతో ఈ అంశంపై ఈడీ దృష్టిసారించింది. అవినీతి ద్వారా అక్రమంగా సంపాదించిన మనీలాండరింగ్ ఏ విధంగా మళ్లించారనే కోణంలో ఈడీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు.

# జేఎన్‌టీయూ హాస్టళ్లలో భద్రత డొల్ల!

**హైదరాబాద్ :** జేఎన్‌టీయూ హాస్టళ్లలో భద్రతా లోపాలున్నాయని పోలీసులు స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకొని యాజమాన్యం తగిన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 3, 4 తేదీల్లో రెండు వర్గాలకు చెందిన విద్యార్థులు పరస్పరం భౌతిక దాడులకు దిగడం, యూనివర్సిటీ లోపల, వెలుపల వాతావరణం రణరంగంగా మారడంపై కూకట్‌పల్లి జోన్ పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించారు.సుమారు 36మంది విద్యార్థులపై కేసులు నమోదు కావడంతో.. సమగ్ర విచారణ అనంతరం విద్యార్థుల భద్రతకు సంబంధించి యాజమాన్యానికి కీలకమైన సూచనలు చేస్తూ కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రితిరాజ్ లేఖ రాశారు. సెప్టెంబరు 3, 4తేదీల మధ్య అర్ధరాత్రి సమయంలో 4 వేర్వేరు సంఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆయా ఘటనలను పరిశీలిస్తే విశ్వవిద్యాలయం వైపు నుంచి



లోపాలు కనిపించాయని పేర్కొన్నారుఅంత జరిగినా అడ్డుకున్న వారేలేరు..ఒక విద్యార్థి మంజీరా హాస్టల్ గది తలుపును పగులగొట్టి లోపల ఉన్న విద్యార్థులపై దాడి చేయడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, అక్కడ హాస్టల్ వార్డెన్ కానీ, సెక్యూరిటీ సిబ్బంది కానీ ఎవరూ అందుబాటులో లేరు. సుమారు 10 నుంచి 15 నిమిషాల పాటు ఇదే పరిస్థితి కొనసాగినప్పటికీ, పరిస్థితిని అదుపు చేయడానికి విశ్వవిద్యాలయం నుంచి ఎవరూ ముందుకు రాలేదు. వార్డెన్‌గా నియమితులైన అధికారి యూనివర్సిటీ క్యాంపస్‌కు చాలా దూరంలో నివసిస్తున్నట్లు తెలిసింది.మొదటి సంఘటన హాస్టల్ సమీపంలోనే బహిరంగ ప్రదేశంలో జరిగినా ఎటువంటి సీసీ ఫుటేజ్ లభించలేదు. గతంలో జరిగిన అనేక సంఘటనలను పరిష్కరించడంలో యూనివర్సిటీ యంత్రాంగం వైఫల్యం చెందడం వల్లే ప్రస్తుత సంఘటన తీవ్రరూపం దాల్చింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని డీసీపీ కోరారు.భద్రత కోసం పోలీసుల సూచనలివీ..సెప్టెంబర్ 3, 4 తేదీల మధ్య అర్ధరాత్రి విద్యార్థుల దురుసు ప్రవర్తనను ఎదుర్కోవడంలో ప్రస్తుత ఏజెన్సీ విఫలమైనందున, ఈ సమస్యను పరిష్కరించగల సామర్థ్యం ఉన్న, ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ రెగ్యులేషన్ యాక్ట్ 2005 కింద లైసెన్స్ పొందిన సెక్యూరిటీ ఏజెన్సీని నియమించాలి. హాస్టళ్లకు వార్డెన్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వార్డెన్ హాస్టల్‌లోనే ఉంటూ, ఏదైనా సమస్య తలెత్తినప్పుడు తక్షణమే అందుబాటులో ఉండాలి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా స్పందించడానికి, హాస్టళ్ల ప్రధాన గేటు సమీపంలో తగినంత సెక్యూరిటీ గార్డులను నియమించాలి.కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ) సూచించిన విధంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. విద్యార్థులను అర్థం చేసుకోగల, వారు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత పరిపాలనా అధికారుల దృష్టికి తీసుకురాగల అర్హత కలిగిన కౌన్సిలర్లను తగినంత మందిని నియమించాలి. భద్రతా చర్యల అమలుకు సంబంధించి ఎస్‌హెచ్ఓతో సమన్వయం కోసం లైజన్ ఆఫీసర్‌ను నియమిస్తే మేలు. ఇలా చేస్తే భవిష్యత్తులో ఏవైనా ఘటనలు జరిగితే సకాలంలో స్పందించడానికి వీలవుతుందని పోలీసులు సూచించారు.

# ఏవియేషన్ రంగంలో తెలంగాణ యువతకు లక్కీ ఛాన్స్!

**హైదరాబాద్,** తెలంగాణ విద్యార్థులకు విమానయాన రంగంలో అంతర్జాతీయ స్థాయి అవకాశాలు, అత్యుత్తమ శిక్షణ కల్పించే లక్ష్యంతో సాంకేతిక విద్యాశాఖ కీలక అడుగు వేసింది. హైదరాబాద్ పాత ఎయిర్‌పోర్ట్‌లో ఉన్న 'తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ' తో సాంకేతిక విద్యా శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు డా. కే. కేశవ రావు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది.సమగ్ర శిక్షణ: జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ లో ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్ మూడేళ్ల



డిప్లొమా ప్రోగ్రామ్ చదువుతున్న విద్యా ర్థులకు పరిశ్రమ అవసరాలకు తగినట్లుగా ప్రత్యక్ష శిక్షణ ఇస్తారుథియరీ, ప్రాక్టికల్స్: విద్యార్థులకు తరగతి గది థియరీతో పాటు ల్యాబ్ ప్రాక్టికల్స్, ఆధునిక ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్‌పై ప్రత్యక్ష ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్ కల్పిస్తారు.2,100 గంటల ఇండస్ట్రియల్ ట్రైనింగ్: డిప్లొమా చివరి ఏడాదిలో భాగంగా లో ఏడాది పాటు దాదాపు 2,100 గంటల నిడివితో ప్రత్యక్ష ప్రాక్టికల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ పొందే అవకాశం కల్పిస్తున్నారు.భద్రతా ప్రమాణాలు: విమానాల నిర్వహణలో ఏవియేషన్ సేఫ్టీ, సెక్యూరిటీ ప్రమాణాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. ఈ శిక్షణ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ ) నిబంధనలకు అనుగుణంగా సాగుతుంది.ఉపాధి అవకాశాలు: ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ప్రముఖ ఎయిర్‌లైన్స్, ఎంఆర్‌ఓలు, ఏరోస్పేస్ రంగాంశాలతో నేరుగా అనుసంధానం ఏర్పడుతుందిఐదేళ్ల కాలపరిమితి: సాంకేతిక విద్యాశాఖ - మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందం ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. 90 శాతం హాజరుతో పాటు ఉత్తమ పనితీరు ప్రమాణాలు కనబరిచిన విద్యార్థులకు ప్రాక్టికల్ ట్రైనింగ్ సర్టిఫికెట్ అందజేస్తారు.

# 'వికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలతోనే సమగ్రాభివృద్ధి'

**చుంచుపల్లి, సెప్టెంబర్ 24 :** గ్రామ పంచాయతీల వాస్తవ అవసరాలు, స్థానిక వనరులను గుర్తించి పక్కా ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపట్టినప్పుడే గ్రామాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీవో) విద్యా చందన అన్నారు. ఎన్.కె. నగర్ కమ్మ సత్రంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,




సిబ్బందికి వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు--పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో విద్యా చందన మాట్లాడుతూ... 'వికసిత్ భారత్ ఏ2047' లక్ష్యానికి అనుగుణంగా గ్రామాల సమగ్రాభివృద్ధికి పంచాయతీ స్థాయిలో పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. గతంలో 317 రకాల పనులకు అవకాశం ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 375కు పెరిగిందని తెలిపారు. అదేవిధంగా 100 రోజులు పని పది దినాలను 125 రోజులుగా పెంచారని తెలిపారు. అక్టోబర్ 2 నుంచి 2027 జూన్ వరకు చేపట్టాల్సిన పనులను ముందుగానే గుర్తించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.మూడు ప్రధాన విభాగాల్లో అభివృద్ధి పనులువికసిత్ భారత్ గ్రామ పంచాయతీ ప్రణాళికల్లో ప్రధానంగా మూడు విభాగాలకు ప్రాధాన్యం ఉంటుందని డీఆర్‌డీవో వివరించారు.మొదటిది -- నీటి భద్రత : నీటి సంరక్షణ, నీటిని నిల్వ చేసుకునే చర్యలు, నీటి కుంటల ఏర్పాటు తదితర పనులు చేపట్టాలన్నారు.రెండవది -- గ్రామీణ మౌలిక వసతులు : పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, పశువైద్య మౌలిక వసతులు తదితర అవసరమైన నిర్మాణాలను ప్రణాళికలో చేర్చాలని సూచించారు.

# వరంగల్ విమానాశ్రయానికి 'రాణి రుద్రమ'.. ఆదిలాబాద్‌కు 'కొమరం భీం' పేర్లు!

**వరంగల్:** ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులకు పేర్ల ఖరారు ప్రభుత్వ నిర్ణయానికి త్వరలో కేబినెట్ ఆమోదముద్ర ఎయిర్‌పోర్టుల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి అసంతృప్తి చరిత్ర ఉట్టిపడేలా కొత్త డిజైన్లు రూపొందించాలని ఆదేశం వరంగల్‌లోని మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు రాష్ట్ర ప్రభుత్వం పేర్లు ఖరారు చేసింది. మామునూరు ఎయిర్‌పోర్టుకు కాకతీయ రాణి రుద్రమదేవి పేరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ఆదివాసీ యోధుడు కొమురం భీం పేరు పెట్టాలని ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ మేరకు ఫైలును కేబినెట్ సమావేశం ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.ఇటీవల జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ పేర్లపై చర్చ జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో కొత్త విమానాశ్రయాలకు స్వాతంత్ర్య సమరయోధుల



పేర్లు పెట్టిన తరహాలోనే, తెలంగాణ చారిత్రక వైభవాన్ని, వీరుల పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే, ఈ పేర్లను ఖరారు చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా లేఖ పంపనున్నారు. కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాగానే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. అయితే, మామునూరు ఎయిర్‌పోర్టుకు సమ్మక్క-సారలమ్మ పేరు కూడా పరిశీలనలో ఉందని, దీనిపై త్వరలోనే స్పష్టత రానుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

డిజైన్లపై సీఎం అసంతృప్తిఇదే సమీక్షలో విమానాశ్రయాల డిజైన్లపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. అధికారులు చూపిన డిజైన్లను చూసి "ఇవి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) డిజైన్లా? లేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో చేసినవా?" అని ప్రశ్నించినట్లు తెలిసింది. విమానాశ్రయాల నిర్మాణం అద్భుతంగా, తెలంగాణ చరిత్ర, సంస్కృతి ఉట్టిపడేలా ఉండాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సీఎం సూచనల మేరకు అధికారులు ఇప్పుడు కొత్త డిజైన్లను సిద్ధం చేసే పనిలో పడ్డారు. త్వరలోనే తుది డిజైన్లను మళ్లీ సీఎంకు సమర్పించనున్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

## దసరా ఉత్సవాలు.. అస్సాం ప్రముఖులకు ఎంపీ చిన్ని ప్రత్యేక ఆహ్వానం



**విజయవాడ, సెప్టెంబర్ 24:** దేశంలోని వివిధ రాష్ట్రాల ప్రముఖులను విజయవాడ దసరా ఉత్సవాలకు ఆహ్వానిస్తూ నగరానికి మరింత జాతీ య గుర్తింపు తీసుకురావడంపై విజ యవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ప్రత్యేక దృష్టి సారించారు. అస్సాం ప్రముఖులకు విజయవాడ ఆతిథ్యాన్ని అందించేందుకు చిన్ని ప్రత్యేక ఆహ్వానం పలికారు. (గురువారం) అస్సాం ఆరోగ్య శాఖ మంత్రి అశోక్ సింఘాల్, సీఎస్ డాక్టర్ రవి కోటను మర్యాదపూర్వకంగా కలిశారు.ఏపీ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి అస్సాం ప్రముఖులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విజయవాడ దసరా నవరాత్రి ఉత్సవాలకు రావాల్సిందిగా అస్సాం ప్రముఖులకు ఆహ్వానం పలికారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకోవాలని తెలిపారు. దుర్గమ్మ దర్శనంతో పాటు విజయవాడ నగర సాంస్కృతిక వైభవాన్ని చాటే 'విజయవాడ ఉత్సవ్'లో పాల్గొనాలని కోరారు.విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటేలా విజయవాడ ఉత్సవ్ నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు ఎంపీ తెలిపారు. ఇంద్రకీలాద్రి వైభవం, విజయవాడ ప్రత్యేకతను ప్రతిబింబించేలా విజయవాడ ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని వెల్లడించారు.

## 'హైకోర్టులో విచారణ జరుగుతుండగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడమేంటి?'



**అమరావతి:** సాయికృష్ణ అదృశ్యంపై సీబీఐ దర్యాప్తు చేయాలన్న పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు అక్టోబర్ 26కు వాయిదా వేసింది. ఈ కేసులో వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తి సీబీఐ దర్యాప్తు కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇవాళ విచారణ సందర్భంగా పిటిషనర్ న్యాయవాదికి జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం పలు ప్రశ్నలు సంధించింది. ఈ కేసుకు సంబంధించి హైకోర్టులో విచారణ జరుగుతుండగా సుప్రీంకోర్టులో పిటిషన్ వేయడమేంటని ప్రశ్నించింది. హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసిన కేసును బదిలీ చేయాలనడం సమంజసమా అని ధర్మాసనం నిలదీసింది. హెబియస్ కార్పస్ విషయంలో మృతుడి తల్లికి లేని ఆసక్తి మీకెందుకని ప్రశ్నించింది. హైకోర్టులో ఏం తీర్పు వస్తుందో చెప్పలేం కదా అని వ్యాఖ్యానించింది. పిటిషనర్‌కు పరిమితులు ఉన్నాయని వాటికి లోబడే ఉండాలంది. మీ వాదనలు, సమాచారం ఆధారంగా మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చామని న్యాయస్థానం పేర్కొంది. పిటిషనర్ కోర్టుకు సమర్పించిన విషయాలు సరిగా లేవని, కోర్టుకు చెప్పిన విషయాల్లో కచ్చితత్వం లేదంది. హైకోర్టు నిర్ణయం తర్వాతే తదుపరి విచారణనని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.అసలేం జరిగిందంటే : విజయవాడ కృష్ణలంకకు చెందిన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కృష్ణలంక సీఐ నాగరాజు, మరికొందరు కలిసి సాయికృష్ణను చిత్రహింసలు గురిచేసి చంపేశారని మృతుడి తల్లి విజయలక్ష్మి ఆరోపించింది. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించి సీఐ నాగరాజు సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఈ కేసు త్వరితగతిన పూర్తి చేసేందుకు సిట్?ను ఏర్పాటు చేసింది.వెంటనే రంగంలోకి దిగిన సిట్ సీఐ నాగరాజుతో పాటు అతడికి సహకరించిన కానిస్టేబుల్స్ అశోక్, నాని, కృష్ణలంక క్రైమ్ కానిస్టేబుళ్లు బాబురావు, సాంబయ్య, హోంగార్డు వెంకటరాజు, సురేశ్?ను అరెస్ట్ చేసి రిమాండ్?కు తరలించింది. మూడు నెలల పాటు దర్యాప్తు చేసి కీలకమైన సాక్ష్యాలను సేకరించింది. పలు సాంకేతిక ఆధారాలతో కేసును ఛేదించింది. ఈ మేరకు కోర్టులో దాఖలు చేసిన అభియోగపత్రంలో ఏడుగురిని నిందితులుగా, 120 మందిని సాక్షులుగా చేర్చింది. కస్టడీలో చిత్రహింసలుపెట్టి కొట్టడంతోనే సాయికృష్ణ చనిపోయాడని సిట్ తేల్చింది.ప్రాథమిక అభియోగపత్రానికి తోడు మరో అనుబంధ ఛార్జ్‌షీట్?ను సిట్ త్వరలో దాఖలు చేయనుంది. కొత్తగా వెలుగుచూసే అంశాలను ఇందులో పొందుపర్చనున్నారు. ఇందులో డీఎన్ఏ పరీక్షల ఫలితాలను చేర్చనున్నారు. ఇప్పటికే కృష్ణలంక స్టేషన్ పైభాగంలో రక్తపు మరకలు ఉన్న లాఠీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దానికి అంటుకున్న రక్తపు మరకల నమూనాలను సేకరించారు. వీటిని సాయికృష్ణ తల్లి నుంచి తీసుకున్న రక్త నమూనాలతో ఫోరెన్సిక్ నిపుణులు పోల్చనున్నారు. వీటిని తదుపరి వేసే ఛార్జ్?షీట్?లో ప్రస్తావించనున్నారు.

## తుది అంకానికి "సర్" - ఏపీలో 1.53 లక్షల మంది అనర్హులు




**అమరావతి:** రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల్లో లోపాలు, తప్పిదాలు ఉన్నట్లు గుర్తించిన 44.28 లక్షల మంది ఓటర్లకు ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. 44 లక్షల మందికి పైగా విచారణ పూర్తికాగా, వారిలో 1.53 లక్షల మందిని అనర్హులుగా తేల్చింది. మరో 41 లక్షల మంది పేర్లను అక్టోబరు 9న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో కొనసాగించాలని నిర్ణయించింది. ఎన్నికల సంఘం వివరాల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 44,28,444 మందికి నోటీసులు సిద్ధం చేయగా, ఇప్పటివరకు 43.71 లక్షల మందికి పంపిణీ పూర్తైంది. నోటీసులు అందుకున్న వారిలో 44,00,225 మంది విచారణకు హాజరయ్యారు. వీరిలో 41,00,002 మంది సమర్పించిన వివరాలు సక్రమంగా ఉన్నట్లు తేలడంతో వారి పేర్లను తుది జాబితాలో కొనసాగించాలని నిర్ణయించారు. మరో 1,46,623 మంది సమర్పించిన ఆధారాల పరిశీలన కొనసాగుతోంది. ఇంకా 28,619 మంది ఓటర్ల విచారణ మిగిలి ఉండగా, దీనికి అక్టోబరు 5 వరకు గడువు ఉంది.ఎన్యూమరేషన్ పత్రాల్లో చాలామంది ఓటర్లు తమ వివరాలను మ్యాచింగ్ చేయకుండా వదిలేశారు. మరికొందరు తప్పిదాలు, లోపాలతో కూడిన వివరాలతో మ్యాచిం గ్ చేసుకున్నారు. అలాంటి వారందరికీ ఎన్నికల సంఘం నోటీసులిచ్చి విచారించింది.మ్యాచింగ్‌లోనే ఎక్కువ తప్పులు: సర్ నిబంధనల ప్రకారం ప్రస్తుత ఓటర్ల జాబితాలోని వివరాలను 2002 నాటి ఓటర్ల జాబితాతో సరిపోల్చాల్సి ఉంటుంది. అయితే చాలామంది ఓటర్లు తమ పేరు, తల్లిదండ్రులు లేదా తాతలు, నాన్నమ్మల వివరాలను మ్యాచింగ్ చేయకుండా వదిలేశారు. మరికొందరు తప్పులు, లోపాలతో కూడిన వివరాలను నమోదు చేశారు. ఇలాంటి లోపాలు ఉన్నవారే ఎక్కువగా నోటీసులు అందుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 44.23 లక్షల మంది ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు గుర్తించగా, వారిలో 43.71 లక్షల మందికి ఇప్పటివరకూ నోటీసుల పంపిణీ పూర్తయింది. నోటీసులు అందుకున్న వారిలో 36 లక్షల మంది తప్పిదాలు, లోపాలతో మ్యాచింగ్ చేసుకున్న వారే ఉన్నారు. గుర్తించిన ప్రధాన లోపాలివే: ఎన్యూమరేషన్ పత్రాల పరిశీలనలో పలు అసంగతులు బయటపడ్డాయి. తల్లిదండ్రులు--పిల్లల మధ్య వయస్సు తేడా 15 ఏళ్ల కంటే తక్కువగా, 50 ఏళ్ల కంటే ఎక్కువగా నమోదు కావడం, ఓటరు--తాత లేదా నాన్నమ్మ మధ్య వయస్సు తేడా 40 ఏళ్ల కంటే తక్కువగా ఉండటం వంటి లోపాలు అధికారులు గుర్తించారు. అలాగే ప్రస్తుత జాబితా, 2002 జాబితాలో తండ్రి పేరులో తేడాలు ఉండటం, ఒకే తల్లిదండ్రులకు చెందిన పిల్లల మధ్య వయస్సు తేడా 9 నెలల కంటే తక్కువగా నమోదు కావడం, ఓటర్ల పేర్లు, తల్లిదండ్రుల వివరాల్లో తప్పులు వంటి లోపాలు కూడా వెలుగుచూశాయి.ఈ తరహా తప్పిదాలున్న ఓటర్లందరికీ నోటీసులు జారీ చేసి, ఆధారాలు సమర్పించాలని ఎన్నికల సంఘం సూచించింది. విచారణ పూర్తై అర్హత నిర్ధారణ అయిన వారి పేర్లు మాత్రమే అక్టోబరు 9న విడుదలయ్యే తుది ఓటర్ల జాబితాలో ఉండనున్నాయి.

## వివేకా కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరం.. పలువురికి నోటీసులు



**కడప, సెప్టెంబర్ 24 :**
మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ఈడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈడీ విచారణకు ఏ2 నిందితుడు సునీల్ యాదవ్ హాజరయ్యారు. వివేకా హత్య ముందు, హత్య తర్వాత జరిగిన ఆర్థిక లావాదేవీలపై ఈడీ అధికారులు ఆయనను ప్రశ్నించారు. బ్యాంక్ అకౌంట్ వివరాలు ఆర్థిక లావాదేవీల వివరాలను ఈడీకి సునీల్ యాదవ్ అందజేశారు. ఈ హత్యకు రూ.40కోట్ల ఫండింగ్, రూటింగ్‌పై ఈడీ అధికారులు సునీల్ యాదవ్‌ను ప్రశ్నించారు.వివేకా హత్యతో నాకు సంబంధం లేదు: సునీల్ యాదవ్వివేకా హత్య కేసు విచారణలో సీబీఐకు సహకరించినట్లే, ఈడీకి కూడా సహకరిస్తానని ఏ2 నిందితుడు సునీల్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కేసులో తాను వైట్ పేపర్ లాంటి వాడినని చెప్పుకొచ్చారు. ఈ హత్యకు తనకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. వైసీపీ హయాంలో తాను అణిచివేతకు గురయ్యానని చెప్పారు. వివేకా హత్యకు ముందు, ఆ హత్య తర్వాత జరిగిన లావాదేవీల గురించి అధికారులు అడిగారని తెలిపారు. బ్యాంక్ స్టేట్‌మెంట్స్‌తో పాటు తాను ఈడీ అధికారుల విచారణకు హాజరయ్యానని తెలిపారు. ఈడీ ఎప్పుడు విచారణకు ఆదేశించిన తాను సహకరిస్తానని అన్నారు. ఈ హత్య కోసం రూ.40 కోట్ల ఫండింగ్, రూటింగ్ అనేది తనకు తెలియదన్నారు. వివేకా హత్య కోసం రూ.40 కోట్ల డీల్ జరిగి ఉండవచ్చుని, కానీ ఈ హత్యతో తనకు సంబంధమే లేదని.. తనకు డబ్బులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఈ హత్య కేసుతో మానసికంగా, ఆర్థికంగా తాను చాలా దెబ్బ తిన్నానని పేర్కొన్నారు. ఈ కేసును ఎంత వీలయితే అంత త్వరగా విచారణ జరిపి పూర్తి చేయాలని సునీల్ యాదవ్ కోరారు.ఈడీ అధికారుల నోటీసులుఅలాగే, వివేకా హత్య కేసులో పలువురికి ఈడీ అధికారులు నోటీసులు అందజేశారు.

## ఏపీ మద్యం రవాణా స్కాం.. అంబటి రాంబాబుకు ఈడీ నోటీసులు



**అమరావతి, సెప్టెంబర్ 24:** ఏపీ మద్యం రవాణా కుంభకోణం కేసులో వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకుఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) నోటీసులు జారీ చేసింది. (శుక్రవారం) విచారణకు రావాల్సిందిగా ఫోన్ ద్వారా మాజీ మంత్రికి ఈడీ సమాచారం పంపించింది. ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్ ఈడీ కార్యాలయానికి విచారణకు హాజరుకావాలని అధికారులు కోరారు. అయితే తాను 15 రోజుల క్రితం గుండెకు స్టంట్‌లు వేయించుకున్నానని ఈడీకి అంబటి సమాధానం ఇచ్చారు. డాక్టర్ల సూచన మేరకు ప్రస్తుతం కోలుకుంటున్నానని చెప్పుకొచ్చారు. పూర్తిగా కోలుకున్న తర్వాత అధికారులకు ముందుగా సమాచారం ఇచ్చి విచారణకు వస్తానని మెసేజ్ పంపించారు. తప్పనిసరిగా విచారణకు సహకరిస్తానని ఈడీకి ఇచ్చిన మెసేజ్‌లో అంబటి రాంబాబు పేర్కొన్నారు. అయితే, మాజీ మంత్రి ఇచ్చిన రిప్లైకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు స్పందించాల్సి ఉంది.మరోవైపు మద్యం రవాణా కుంభకోణంలో ఈరోజు మర్రి సుబ్బారెడ్డి, పురుషోత్తం రావుల స్టేట్మెంట్‌లను ఈడీ అధికారులు రికార్డ్ చేశారు. ఈరోజు ఉదయం ఈ కేసుకు సంబంధించి వీరిని ఈడీ అధికారులు ప్రశ్నించారు. గత వైసీపీ హయాంలో ప్రభుత్వ మద్యం దుకాణాలకు లిక్కర్‌ను రవాణా చేసేందుకు సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు కాంట్రాక్టులు ఇచ్చినట్లు ఈడీ గుర్తించింది. మొదటి కాంట్రాక్ట్ కాలంలో మర్రి సుబ్బారెడ్డి, రాయపాటి పురుషోత్తమరావు కలిసి సుమారు రూ.59.14 లక్షల మద్యం పెట్టెలను రవాణా చేసిన దానిపై ఈడీ ప్రశ్నించినట్లు తెలుస్తోంది.

## విద్యుత్ వైర్లు తెగితే వెంటనే సమాచారం ఇవ్వాలి




**అమరావతి, సెప్టెంబర్ 24:** విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమీక్ష నిర్వహించారు. బాపట్ల మండలంలో విద్యుత్ వైర్ తగలి తల్లి, కుమారుడు మృతి చెందిన ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అలాగే నర్సీపట్నం నాతవరంలో విద్యుదాఘాతంతో ఇద్దరు మహిళల మృతిపై కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇదే ఘటనలో గాయాలపాలైన నాగరాజును మెరుగైన వైద్య సదుపాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ రెండు ప్రమాద ఘటనలకు గల కారణాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఎల్‌టీ విద్యుత్ లైన్ తెగి నేలవైపు వేలాడుతుండటాన్ని గమనించక దానిని తాకడంతో తల్లీ, కుమారుడు అక్కడికక్కడే విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు అధికారాలు వెల్లడించారు.దీంతో వాయుగుండం కారణంగా ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు పడినా, వైర్లు తెగినా ప్రజల్ని అప్రమత్తం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలు కూడా వెంటనే సమీప కార్యాలయానికి ఫిర్యాదు చేసేలా సమాచార వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు. ముందు జాగ్రత్త చర్యలతో ప్రమాదాలను నివారించాలని సూచించారు. ఘటనలు పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. అలాగే ఉత్తరాంధ్ర ఈదురుగాలులు, వర్షాల వల్ల తాజా పరిస్థితిపైనా మంత్రి ఆరా తీశారు. పలుచోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడితే, కొన్ని చోట్ల ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సరఫరా నిలిపినట్లు అధికారులు తెలిపారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 70-80కి.మీ మేర గాలులు వీస్తున్నందున సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని వివరించారు.వాతావరణ పరిస్థితులకు తగ్గట్టుగా విద్యుత్ సరఫరాను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని మంత్రి ఆదేశించారు. ఎస్పీడీసీఎల్ నుంచి అదనపు సిబ్బందిని, మెటీరియల్ కూడా ఉత్తరాదికి పంపినట్లు తెలిపారు. సాధారణ పరిస్థితి నెలకొనే వరకూ అన్ని చోట్ల విద్యుత్ శాఖ పూర్తి స్థాయిలో సన్నద్ధమై అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఎక్కడా ప్రాణ నష్టం వాటిల్లకుండా అధికారులు విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిశానిర్దేశం చేశారు.

## తిరుమల బ్రహ్మోత్సవాల్లో 33 లక్షల లడ్డూ ప్రసాదాలు విక్రయం



**తిరుమల:** శ్రీ వేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అశేష భక్తజన సందోహం మధ్య అంగరంగ వైభవంగా, దిగ్విజయంగా ముగిశాయని తిరుమల తిరుపతి దేవస్థాన ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. ఈ 8 రోజుల్లో 5.76 లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని వివరించారు. రూ.28.94 కోట్ల హుండీ కానుకలు వచ్చాయని తెలిపారు. 33 లక్షల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను విక్రయించామన్నారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి ఆయన మాట్లాడారు.ఒక్క రోజులో దర్శనాలు కల్పించడం రికార్డు: బ్రహ్మోత్సవాల్లో అత్యంత కీలకమైన గరుడ సేవ రోజున భక్తుల రద్దీని టీటీడీ యంత్రాంగం సమర్థంగా నియంత్రించినట్లు ఛైర్మన్? వివరించారు. ఆ రోజు వచ్చిన భక్తులకు ఆ రోజే శ్రీవారి దర్శనం కల్పించడం రికార్డుగా అభివర్ణించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు సామాన్య భక్తులు సైతం పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని ఛైర్మన్ తెలిపారు.'బ్రహ్మోత్సవాల్లో 7,871 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను ఆకట్టుకున్నారు. తొలిసారి జర్మనీ, సింగపూర్ దేశాల కళాకారుల బృందాలు తిరుమల మాడ వీధుల్లో ప్రదర్శన ఇచ్చాయి. ఆర్టీసీ దాదాపు 27 వేలకు పైగా ట్రిప్పులు నడిపారు. 60 టన్నుల పూలు, 4 లక్షల కట్ ఫ్లవర్స్‌తో చేసిన అలంకరణలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.' -బీఆర్ నాయుడు, తిరుమల తిరుపతి దేవస్థాన ఛైర్మన్సమావేశంలో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, నరేష్ కుమార్, జానకి దేవి, పనబాక లక్ష్మి, నన్నపనేని సదాశివరావు, జంగా కృష్ణ మూర్తి పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో ప్రధాన గణాంకాలు ఇలా ఉన్నాయి
అన్నప్రసాదాల పంపిణీ: 21.84 లక్షల మందికి
తలనీలాలు సమర్పించినవారు: 2.04 లక్షల మంది
వైద్య సేవలు: 50 మంది డాక్టర్లు, 150 మంది పారామెడికల్ సిబ్బంది, 16 అంబులెన్సులుడిజిటల్ కవరేజీ: మాడ వీధుల్లో 36 భారీ డిజిటల్ స్క్రీన్లు; ఎస్వీబీసీ ద్వారా ప్రపంచవ్యాప్తంగా 20 కోట్ల మందికి ప్రత్యక్ష

## ఏపీలో మద్యం దుకాణాల లాటరీ వాయిదా.. కొత్త తేదీ ఇదే



ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాల లాటరీ నిర్వహణ షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. తొలుత సెప్టెంబర్ 30న లాటరీ నిర్వహిస్తామని ప్రకటించినప్పటికీ, తాజాగా దానిని అక్టోబర్ 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ వెల్లడించింది.నవీకరణ (రెన్యువల్) కాని సుమారు 400 మద్యం దుకాణాలకు కొత్తగా దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఈరోజు (గురువారం) గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. ఆసక్తి గల వ్యాపారులు గురువారం నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అందిన దరఖాస్తుల ఆధారంగా అక్టోబర్ 5న లాటరీ నిర్వహించి, కొత్త లైసెన్సుదారులను ఎంపిక చేస్తారు.అయితే, ఒక దుకాణానికి కనీసం 10 దరఖాస్తులు వస్తేనే అక్కడ లాటరీ పద్ధతిని చేపట్టనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, బుధవారం సాయంత్రం నాటికి రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఆర్ఈటీ) రెన్యువల్, లైసెన్స్ ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రూ. 1,268 కోట్ల ఆదాయం సమకూరినట్లు సమాచారం.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY
తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
శుక్రవారం, సెప్టెంబర్ 25 2026



# ఐపీఎల్ వేలంపై బీసీసీఐ కీలక ప్రకటన.. ఈ సారి భారత్‌లోనే.. ఎక్కడో తెలుసా..?




ప్రపంచంలోనే అత్యంత పాపులర్ క్రికెట్ లీగ్ అయిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2027 సీజన్ వేలానికి రంగం సిద్ధమవుతోంది. గత మూడేళ్లుగా విదేశాల్లో జరిగిన ఐపీఎల్ వేలాన్ని ఈసారి మళ్లీ భారత్‌లోనే నిర్వహించబోతున్నట్లు బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. పర్యాటక కేంద్రమైన గోవా వేదికగా ఈ ఏడాది డిసెంబర్‌లో ఐపీఎల్ 2027 వేలం జరగనుంది. బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా ఈ కీలక వివరాలను వెల్లడించారు. గతంలో సౌదీ అరేబియా, దుబాయ్, అబుదాబి వంటి అంతర్జాతీయ వేదికలపై మూడు విడతలుగా విజయవంతంగా నిర్వహించిన తర్వాత ఈసారి డిసెంబర్‌లో స్వదేశంలోని గోవాలో ఐపీఎల్ వేలాన్ని ఏర్పాటు చేయాలని బోర్డు నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఈసారి జరగబోయేది మినీ వేలం కావడంతో ఫ్రాంచైజీలు తమ ప్రధాన ఆటగాళ్లను అలాగే అట్టేపెట్టుకునే అవకాశం ఉంది. 2027 సీజన్‌కు సంబంధించి ప్రతి ఫ్రాంచైజీ వద్ద బేస్‌లైన్ పర్స్ విలువ రూ.120 కోట్లుగా ఉండనుండగా, మొత్తం సాలరీ క్యాప్‌ను రూ.157 కోట్లుగా నిర్ణయించారు. అయితే ఆటగాళ్ల కొనుగోలుకు ఫ్రాంచైజీల వద్ద మిగిలే తుది బడ్జెట్ ఎంతనేది రిటెన్షన్ ప్రక్రియ, ప్లేయర్ల విడుదల, ట్రేడింగ్ విండో ముగిసిన తర్వాతే తేలనుంది. మరోవైపు మ్యాచ్ ఫలితాలను శాసించే ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనను రాబోయే సీజన్‌లో కొనసాగించాలా వద్దా అనే అంశంపై ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఇంకా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

మరోవైపు భారత్ ఎ ఉమెన్స్, ఆస్ట్రేలియా ఎ ఉమెన్స్ జట్ల మధ్య సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు జరగాల్సిన మల్టీ డే మ్యాచ్ వేదికను ధర్మశాల నుంచి మొహాలీకి చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం మిగిలిన మార్చినట్లు బీసీసీఐ ప్రకటించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మైదానం, ఔట్‌ఫీల్డ్ చిత్తడిగా మారి మ్యాచ్ నిర్వహణకు అనుకూలంగా లేకపోవడంతోనే ఈ మార్పు చేశారు. ఈ షెడ్యూల్ ప్రకారం మిగిలిన మ్యాచ్‌లు ఇకపై మొహాలీలోని పీసీఏ ఐఎస్ బింద్రా స్టేడియంలో జరుగుతాయి. ప్రస్తుతానికి ఇరు జట్ల మధ్య జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు కూడా మొహాలీనే ఆతిథ్యం ఇస్తోంది. తొలి వన్డేలో 236 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి భారత్ 'ఎ' మహిళల జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించిన సంగతి తెలిసిందే. వాతావరణ పరిస్థితుల వల్ల మ్యాచ్‌లకు ఎలాంటి ఆటంకం కలగకుండా, క్రికెట్ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటానికే ధర్మశాల వేదికను మొహాలీకి మార్చినట్లు బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

# ఆసియా కప్ 2027కి 6 జట్లు ఖరారు.. లక్కీ ఛాన్స్ పట్టేసిన నేపాల్ టీం..!




వన్డే ఫార్మాట్‌లో జరగనున్న ఆసియా కప్ 2027 (ూంఖు జబజూ 2027) టోర్నీలో పాల్గొనే మొత్తం 6 జట్ల వివరాలు అధికారికంగా ఖరారయ్యాయి. గతంలో టీ20 ఫార్మాట్‌లో జరిగిన ఈ టోర్నీలో 8 జట్లు బరిలో దిగగా, ఈసారి మాత్రం 6 జట్లకు మాత్రమే అవకాశం లభించింది. బంగ్లాదేశ్ (ధీఖఅస్త్రశ్రీఖఎవంష్ట) ఆతిథ్యం ఇవ్వనున్న ఈ టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత క్రికెట్ జట్టు (ఎఖఎ ×అఎఖు)తో పాటు పాకిస్థాన్ ( శ్రీలంక (, అఫ్గానిస్థాన్ (ూటన్త్రష్ఖుఅఱర్ఖఅ) జట్లకు నేరుగా ప్రవేశం దక్కింది. ఈ జాబితాలో ఆఖరి స్థానం కోసం జరిగిన ఏసీసీ ప్రీమియర్ కప్ తుది పోరు అత్యంత ఆసక్తికరంగా సాగింది. మలేషియా లోని బాయుమాస్ ఓవల్ మైదానంలో 10 అసోసియేట్ దేశాల మధ్య ఈ టోర్నీ నిర్వహించారు. ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 12 వరకు సాగిన ఈ సిరీస్‌లో నేపాల్ జట్టు ఫైనల్ చేరింది. తుది పోరులో యూఏఈ (ఖూజు) జట్టుపై 44 పరుగుల తేడాతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. నేపాల్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్ ఆసిఫ్ షేక్ అద్భుతమైన సెంచరీతో మెరిశాడు. కెప్టెన్ సందీప్) సారథ్యంలోని ఈ జట్టు స్థిరమైన ప్రదర్శనతో ఆసియా కప్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకుంది. నేపాల్ క్రికెట్ చరిత్రలో ఈ టోర్నీకి అర్హత సాధించడం కేవలం రెండోసారి మాత్రమే కావడం విశేషం. సరిగ్గా 2023వ సంవత్సరంలో తొలిసారిగా ఆసియా కప్‌లో అడుగుపెట్టిన ఈ జట్టు, అప్పట్లో భారత్ అలాగే పాకిస్థాన్ జట్లతో తలపడింది. అప్పట్లో ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించలేకపోయినప్పటికీ, గడిచిన మూడేళ్ల కాలంలో ఆటతీరును మెరుగుపరుచుకుంది. ఇప్పుడు మరింత అనుభవంతో బరిలోకి దిగుతున్న నేపాల్ జట్టు, అగ్రశ్రేణి జట్లకు గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధమవుతోంది.

# ఫిక్సింగ్ ఆరోపణలపై CSK సీరియస్.. సెప్టెంబర్ 25న కీలక నిర్ణయాలు?




భారతీయ క్రికెట్ వర్గాలలో ప్రస్తుతం మ్యాచ్ ఫిక్సింగ్ వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒక ప్రముఖ మీడియా సంస్థ నిర్వహించిన సీక్రెట్ స్టింగ్ ఆపరేషన్ కారణంగా ఢిల్లీ ప్రీమియర్ లీగ్ (ఖూా), ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) ఫ్రాంచైజీ పేర్లు తెరపైకి వచ్చాయి. ఈ పరిణామంతో క్రికెట్ బోర్డులతో పాటు ఫ్రాంచైజీ యాజమాన్యాలు కూడా అప్రమత్తమయ్యాయి. ఆట పవిత్రతను కాపాడేందుకు సంబంధిత వర్గాలు కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నాయి. తెహల్కా స్టింగ్ ఆపరేషన్‌లో వచ్చిన సంచలన ఆరోపణల ప్రకారం.. సీఎస్కే జట్టుకు చెందిన ఒక ఆటగాడు దేశీయ క్రికెట్ మాజీ ఆటగాడికి ఇన్‌సైడ్ సమాచారాన్ని లీక్ చేస్తున్నట్లు తేలింది. ఈ సమాచారాన్ని లండన్‌లోని బుకీలకు భారీ మొత్తానికి విక్రయించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ సెప్టెంబర్ 25న జరగనున్న వార్షిక సాధారణ సమావేశంలో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చించాలని నిర్ణయించింది. అవినీతి నిరోధక కార్యకలాపాలను కఠినతరం చేయడంపై బోర్డు కీలక నిర్ణయాలు తీసుకోనుంది. ఈ ఆరోపణల ప్రకారం.. మ్యాచ్‌లు ప్రారంభం కావడానికి ముందే ప్లేయింగ్ 11 వివరాలు, ఇతర కీలక సమాచారాన్ని సేకరించి బుకీలకు చేరవేశారు. దీని ద్వారా సుమారు 3 కోట్ల రూపాయల వరకు చేతులు మారినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే 2026 సీజన్ కోసం ఆ ఆటగాడిని నేరుగా ఎంపిక చేయనప్పటికీ, అంతర్గత సమాచారాన్ని సేకరించే వనరుగా ఉపయోగించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ తీవ్రమైన పరిణామాలతో సీఎస్కే మేనేజ్‌మెంట్ అంతర్గత విచారణకు కూడా సిద్ధమవుతున్నట్లు సమాచారం.ఈ వివాదంలో తన పేరు వినిపించడంతో ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో సెంట్రల్ ఢిల్లీ కింగ్స్ తరఫున ఆడిన వంశీ బేడి స్పందించారు. మాజీ రంజీ క్రికెటర్ రచిత్ భాటియా పేర్కొన్న స్టింగ్ ఆపరేషన్‌లో తన ప్రమేయం లేదని ఆయన స్పష్టం చేశారు. తాను ఎలాంటి ఫిక్సింగ్ కార్యకలాపాలలో పాల్గొనలేదని సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చారు. గతంలో 2025 ఐపీఎల్‌లో సీఎస్కే జట్టులో భాగమైన వంశీ బేడి, తనపై వస్తున్న నిరాధార ఆరోపణలను ఖండించారు. ఈ ఉదంతంపై బీసీసీఐ, యాంటీ కరప్షన్ యూనిట్ మరింత లోతుగా విచారణ జరిపే అవకాశం ఉంది.

# పసిపిల్లల ఆరోగ్యంతో చెలగాటమా..? నెస్లే ఇండియాపై FSSAI బిగ్ యాక్షన్.. 3 కేసులు నమోదు!




న్యూఢిల్లీ: శిశువుల ఫార్ములా ఆహార ఉత్పత్తులకు సంబంధించి నెస్లే ఇండియాపై భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఖీూూా×) చర్యలు ప్రారంభించింది. నెస్లేకు చెందిన శిశు పోషకాహార ఉత్పత్తులకు సంబంధించి మూడు వేర్వేరు విచారణ కేసులను నమోదు చేసినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించింది. ఖీూూా× పరిశీలనలో నాన్ ఎక్సెల్లా ప్రో స్టేజ్-1, లాక్టోజెన్ ప్రో-1 ఉత్పత్తుల ప్రచారం, లేబుళ్లపై ఉన్న కొన్ని వాదనలపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. నాన్ ఎక్సెల్లా ప్రో స్టేజ్-1కు సంబంధించి 'ఐదు హెచ్ఎంవోలు', 'వే ప్రోటీన్' వంటి అంశాలను ప్రచారంలో ప్రస్తావించినట్లు అధికారులు తెలిపారు. లాక్టోజెన్ ప్రో-1 విషయంలో 'వే ప్రోటీన్ సులభంగా జీర్ణమవుతుంది' అనే వాదనను పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ వాదనలు శిశు ఆహార ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహించే విధంగా ఉన్నాయని, సంబంధిత నిబంధనలకు అనుగుణంగా లేవని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. శిశు పోషకాహారానికి సంబంధించిన 2020 నిబంధనల్లోని నాలుగో నిబంధనలోని రెండో ఉపనిబంధన, అలాగే శిశు పాల ప్రత్యామ్నాయాల చట్టంలోని సంబంధిత నిబంధనలను ప్రస్తావించింది. మరో కేసు తదుపరి దశ శిశు ఫార్ములా ఆహారం పోషక ప్రమాణాలకు సంబంధించినది. నెస్లే తయారు చేసిన ఒక నమూనాను ప్రయోగశాలలో పరీక్షించగా, అందులో బయోటిన్ పరిమాణం నిర్దేశిత ప్రమాణం కంటే తక్కువగా ఉన్నట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. అదే నమూనాను మరోసారి సూచిత ప్రయోగశాలకు పంపి పరీక్షించగా, అక్కడ కూడా నిర్దేశిత స్థాయి కంటే తక్కువగా ఉన్నట్లు వెల్లడించింది. అయితే, నెస్లే ఇండియా తమ ఉత్పత్తులు వర్తించే నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని స్పష్టం చేసింది. సంబంధిత ఉత్పత్తుల లేబుళ్లకు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిపుణుల కమిటీ ఆమోదం ఉందని కంపెనీ తెలిపింది. కాగా, ఈ మూడు కేసుల్లో తదుపరి విచారణ, నిర్ణయం చట్టపరమైన ప్రక్రియలో భాగంగా కొనసాగనుంది.

# మళ్లీ భారీగా పెరుగుతున్న బంగారం ధరలు.



. తెలుగు రాష్ట్రాల్లో తులం ఎంతుందో తెలుసా..?
బంగారం ధరలు నాన్ స్టాప్‌గా పెరుగుతున్నాయి.. ఇటీవల తగ్గి కాస్త ఊరటనిచ్చిన పసిడి ధరలు మళ్లీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అంతర్జాతీయంగా కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులతో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నట్లు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలతో గోల్డ్ రేట్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని బులియన్ మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే.. రెండు రోజులుగా తగ్గిన బంగారం ధరలు.. బుధవారం తులంపై రూ.900ల వరకు పెరిగాయి.. తాజాగా పసిడి ధరలు పెరిగాయి.. అయితే.. పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ఆధారంగా గురువారం (సెప్టెంబర్ 24) ఉదయం 6 గంటల వరకు దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల గోల్డ్ పై రూ.10 మేర పెరిగి ధర రూ.1,54,210 గా ఉది. 22 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధరపై రూ.10 పెరిగి.. రూ.1,41,360 గా ఉంది. వెండి కిలో ధరపై రూ.100 తగ్గి.. రూ.2,49,900 గా కొనసాగుతోంది. అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,54,210, 22 క్యారెట్ల ధర రూ.1,41,360 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,54,900 ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,54,210, 22 క్యారెట్ల ధర రూ.1,41,360 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,54,900 ఉంది.
ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,54,360, 22 క్యారెట్ల ధర రూ.1,41,510 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,49,900 ఉంది. ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,210, 22 క్యారెట్ల ధర రూ.1,41,360 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,49,900 ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,54,190, 22 క్యారెట్ల ధర రూ.1,41,340 ఉంది. వెండి కిలో ధర రూ.2,54,900 ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,54,210, 22 క్యారెట్ల ధర రూ.1,41,360 ఉంది. వెండి కిలో ధర రూ.2,49,900 లుగా ఉంది. కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు.. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం ఎప్పటికప్పుడు మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# ఇంట్లోనే ఎస్‌బీఐ ఈకేవైసీ చేసుకోవడం ఎలా? ఈ లింక్‌లను మాత్రం క్లిక్ చేయొద్దు




ఎస్‌బీఐ ఖాతాదారులు తమ ఖ్జ (ఖఅశీష ్‌శీబతీ జబర్‌శీఎవతీ) వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం అవసరం. ప్రస్తుతం ఉన్న ఖాతాకు =వ-ఖ్జ అవసరమైతే, బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్లకుండానే అధికారిక ఆన్‌లైన్ మార్గాల్లో ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉంటుంది. అయితే కేవైసీ పేరుతో వచ్చే నకిలీ ూమీలు, వాట్సాప్ మెసేజ్‌ల విషయంలో ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి. తెలియని లింకులపై క్లిక్ చేయకుండా స్వయంగా ఎస్‌బీఐ అధికారిక యాప్ లేదా వెబ్‌సైట్‌ను మాత్రమే ఉపయోగించడం సురక్షితమని ఎస్‌బీఐ సూచిస్తోందిఒక కుటుంబంలో ఒకటి కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉండవచ్చా?11న స్కూళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు.. కారణం కొత్త ఇల్లు నిర్మించేటప్పుడు పునాది లెవల్ వరకు ఎంత ఖర్చు ?
ఆండ్రాయిడ్ లోగో ఆకుపచ్చ రోబోట్‌లా ఎందుకు ఉంటుంది?

ఎంచుకోండి: అందుబాటులో ఉన్న ఆప్షన్లలో కేవైసీ అప్‌డేట్ కేవైసీ అనే ఆప్షన్‌ను ఎంచుకోండి. అవసరమైన వివరాలు ఇవ్వండి: అవసరమైతే మీను నమోదు చేసి, స్క్రీన్‌పై కనిపించే కేవైసీ వివరాలను పరిశీలించండి. మార్పులు ఉంటే వాటిని అప్‌డేట్ చేయాలి. అవసరమైన పత్రాలు సమర్పించండి: మీ కేవైసీలో ఏ వివరాలను మార్చుతున్నారనే దానిపై ఆధారపడి సంబంధిత పత్రాలను సమర్పించాల్సి రావచ్చు. ధృవీకరించండి: వివరాలను పరిశీలించిన తర్వాత రిక్వెస్ట్‌ను సబ్మిట్ చేసి, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ూూతో వెరిఫికేషన్ పూర్తి చేయాలి.
ఎస్‌బీఐ పరిశీలన తర్వాత కేవైసీ అప్‌డేట్: మీరు సమర్పించిన వివరాలను బ్యాంక్ పరిశీలించిన తర్వాత ఖ్జ రికార్డుల్లో అప్‌డేట్ చేస్తుంది. కొన్ని సందర్భాల్లో ఎస్‌బీఐ అధికారిక కేవైసీ అప్‌డేట్ సదుపాయం ద్వారా కూడా మీ వివరాలను గుర్తించి కేవైసీ ప్రక్రియను కొనసాగించవచ్చు. ఇందులో పుట్టిన తేదీ, పాన్, సీఐఎఫ్ నంబర్ లేదా అకౌంట్ నంబర్ వంటి వివరాలతో గుర్తింపు ప్రక్రియ ఉండవచ్చు. ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా..ఎస్‌బీఐ ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ను ఉపయోగించే రిటైల్ కస్టమర్లు అధికారిక ఇంటర్నెట్ బ్యాంకింగ్ పోర్టల్‌లోకి లాగిన్ అయి ఖ్జ లేదా ఖ్జ ఖజూఏఠవకు సంబంధించిన ఆప్షన్ కోసం చూడవచ్చు. సాధారణంగా కేవైసీ కోసం అడిగే పత్రాలను సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.:ఏ వివరాలను అప్‌డేట్ చేస్తున్నారనే దానిపై పత్రాల అవసరం ఆధారపడి ఉంటుంది. పత్రాల్లో పాస్‌పోర్ట్, ఓటర్ డ్రైవింగ్ లైసెన్స్ వంటి అధికారిక పత్రాలు ఉన్నాయి. మోసాల విషయంలో జాగ్రత్త:మీకు వంటి మెసేజ్‌లు లేదా ద్వారా వచ్చినా ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని ఎస్‌బీఐ హెచ్చరిస్తోంది. అలాగే తెలియని లింక్‌పై క్లిక్ చేయవద్దు. ఆ లింక్ ద్వారా మీ లాగిన్ వివరాలు, ూూ, కార్డు వివరాలు లేదా ఇతర బ్యాంకింగ్ సమాచారం దొంగిలించే అవకాశం ఉంటుంది.

శుక్రవారం,
సెప్టెంబర్ 25 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# ది ప్యారడైజ్ ట్విట్టర్ రివ్యూ..






దసరా లాంటి సూపర్ హిట్ సినిమా తర్వాత నాని, శ్రీకాంత్ కాంబినేషన్లో వచ్చిన పారడైజ్ సినిమా మీద అంచనాలు భారీగా ఉన్నాయి. మరి వాటన్నింటినీ నిలబెడుతూ పారడైజ్ అంచనాలు అందుకుందా లేదా అనేది పూర్తి రివ్యూలో చూద్దాం..కథ:భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన సవారి జాతికి మాత్రం స్వాతంత్రం రాదు. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో షికింజా మాలిక్ (మోహన్ బాబు) కనుసనల్లో సవారి జాతి బతుకుతుంది. వాళ్లకు గుర్తింపు లేకుండా చేస్తాడు మాలిక్. కానీ తమ జాతికి గుర్తింపు కావాలి అని సమ్మక్క (సోనాలి కులకర్ణి) పోరాడుతూ ఉంటుంది. ఆమె కొడుకు జడల్ (నాని) ఒక మర్డర్ కేసులో 14 సంవత్సరాలు జైల్లో ఉండి వస్తాడు. కాకపోతే తల్లి తప్పు చేసింది అని నమ్మి ఆమెకు దూరంగా ఉంటాడు. ఆ తర్వాత తన జాతి కోసం తల్లి చేసిన త్యాగం అర్థం చేసుకుంటాడు. అదే సమయంలో తిరిగి వచ్చిన తర్వాత షికింజా మాలిక్ కొడుకు విక్రమ్ మాలిక్ (రాఘవ్ జుయల్) తో జడలు కు గొడవ స్టార్ట్ అవుతుంది. అది పెరిగి పెద్దదై పెద్ద మాలిక్ వరకు వెళ్తుంది. ఆ తర్వాత ఏం జరిగింది.. సవారీల పోరాటం ఎంతవరకు వచ్చింది.. వాళ్లకు చివరికి గుర్తింపు వచ్చిందా లేదా అనేది కథ..కథనం:దర్శకుడు శ్రీకాంత్ ఓడలను వాళ్ళ టీం ముద్దుగా మెంటలోడు అని పిలుస్తారు.. ఆ మేకింగ్ ఏంటి.. ఆ టేకింగ్ ఏంటి.. శ్రీకాంత్ ఓదెల నిజంగానే మెంటలోడు అనుకుంటారు.. ఇది పాజిటివ్ యాంగిల్ లో..! ది పారడైజ్ ఫస్ట్ అఫ్ చూసిన తర్వాత నాని కెరీర్ బిగ్గెస్ట్ హిట్ కొట్టాడు అనిపించింది.. కానీ సెకండ్ హాఫ్ దారి తప్పాడు దర్శకుడు శ్రీకాంత్ ఓదెల. అంత పెద్ద ఇంటర్వెల్ సీక్వెన్స్ తర్వాత సెకండ్ హాఫ్ సరిగా డీల్ చేయలేకపోయాడు. ముఖ్యంగా ఫస్ట్ 15 నిమిషాలు చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఆ తర్వాత నాని ఇంట్రడక్షన్.. ప్రీ ఇంటర్వెల్ సీన్స్ మంచి హై ఇస్తాయి. కయాదు లోహర్ సీన్స్ గురించి నో డిస్కషన్.. హీరోయిన్ ట్రాక్ మీద కాస్త ఆలోచించి ఉండాల్సిందే. అలాంటి సన్నివేశాలు కచ్చితంగా ఇబ్బందికరంగానే ఉంటాయి. సెకండాఫ్ లో మోహన్ బాబు వచ్చే సన్నివేశాలు కూడా బాగున్నాయి. కానీ కీలకమైన సన్నివేశాల విషయానికి వచ్చేసరికి పట్టు తప్పినట్టు అనిపించింది. ఫస్టాఫ్ లో వర్కవుట్ అయిన ఎమోషన్ సెకండ్ హాఫ్ లో కుదరలేదు. దానితోడు అనవసరపు రాజకీయాలు సినిమాలో ఇరికించినట్టు అనిపించింది.. క్లైమాక్స్ కూడా పూర్తిగా రాజకీయం చేయడం అసంపూర్తిగా అనిపించింది. గుర్తింపు కోసం చేసే పోరాటానికి సంబంధించిన ఎమోషన్ మిస్ అవుతుంది.. కేవలం స్క్రీన్ మీద వయొలెన్స్ మాత్రమే కనిపిస్తుంది. చాలావరకు సన్నివేశాలు మాస్ ఆడియన్స్ ను మెప్పించేలా ఉన్నాయి. కాకపోతే వాటిని మరింత కన్విన్సింగ్ గా చెప్పి ఉంటే చాలా బాగుండేది.నటీనటులు:నాని తన వరకు అద్భుతంగా నటించాడు.. తన దర్శకుడు ఏం చెప్తే అది చేశాడు. మోహన్ బాబు ఈ సినిమాకు మేజర్ ప్లస్ పాయింట్.. కానీ ఆయనను కూడా ఇంకాస్త వాడుకొని ఉంటే బాగుండేది అనిపించింది. రాఘవ్ జుయల్ ఉన్నంతసేపు బాగున్నాడు. మరొక కీలక పాత్రలో సోనాలి కులకర్ణి బాగా నటించింది.. సంపూర్ణేష్ బాబు ఓకే. కయాదు లోహర్ ఉన్నంతవరకు పర్లేదు. మిగిలిన వాళ్ళు అన్నీ తమ తమ పాత్రలకు న్యాయం చేశారు.టెక్నికల్ టీంఈ సినిమాకు మెయిన్ హీరో అనిరుద్.. ఒక్క ముక్కలో చెప్పాలంటే సినిమా కోసం ప్రాణం పెట్టాడు. చాలా చోట్ల అనిరుద్ సంగీతం సినిమాను కాపాడింది. నవీన్ నూలి సెకండ్ హాఫ్ మీద ఫోకస్ చేసి ఉండాల్సిందే. సినిమాటోగ్రఫీ బాగుంది. శ్రీకాంత్ ఓదెల తనకు వచ్చిన గోల్డెన్ ఛాన్స్ ఇంకాస్త బాగా యూస్ చేసుకొని

## నాని ఈ రేంజ్‌లో యాక్షన్ చేస్తారనుకోలేదు.. ఇరగదీశాడు : రామ్ లక్ష్మణ్ మాస్టర్స్





న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫైట్ మాస్టర్స్ రామ్ లక్ష్మణ్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. రామ్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. నాని గారి క్యారెక్టర్ చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ గారు చాలా కొత్తగా డిజైన్ చేశారు. రెండు జడలు వేసుకున్న హీరోను ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు చూడలేదు. మాకు కూడా అది చాలా కొత్తగా అనిపించింది. నాని గారు ప్రేక్షకులకు కొత్తదనం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. నాని గారు ఈ స్థాయిలో యాక్షన్ చేయడం ఇదే మొదటిసారి. ఇందులో యాక్షన్ సీన్స్ చాలా హెవీగా ఉంటాయి. 'దసరా' కంటే మూడు రెట్లు ఎక్కువ యాక్షన్ ఉంటుంది.

జడలతో యాక్షన్ సీక్వెన్స్ చేయడం మామూలు విషయం కాదు. యాక్షన్ చేస్తున్నప్పుడు ఆ జడలు రూప్‌లకు, ముఖానికి తగులుతుంటాయి. అలాంటి యాక్షన్ సీక్వెన్స్ చేయడం మాకు కూడా కొత్త అనుభవమే. మా అసిస్టెంట్‌కు కూడా అలాంటి జడలు వేయించి అందులో ఉండే కష్టం తెలుసుకుని మరీ యాక్షన్‌ను కంపోజ్ చేశాం. నాని గారి కెరీర్‌లోనే ఇంత కష్టం ఎప్పుడూ పడలేదు. ప్రతి విషయంలో తన 100 శాతం కష్టపడ్డాడు. ఎన్ని టేక్స్ అయినా చేయాలని మనసులో ఫిక్స్ అయ్యాడు. నిజంగా నాని ఇంత కష్టపడతాడని మేం ఊహించుకోలేదు. అంత గొప్పగా ఈ సినిమా కోసం కష్టపడ్డాడు అన్నారు.నాని బేర్ బాడీతో చేసే యాక్షన్ సీక్వెన్స్‌లు ఉంటాయి. అవి స్క్రీన్‌పై చేయడం అంత ఈజీ కాదు. బాడీ బిల్డింగ్ చేయాలి. డైటింగ్‌లో ఉండాలి. ఇందులోనూ దర్శకుడు శ్రీకాంత్ తనకు అనుకున్నది వచ్చేంతవరకు రాజీపడరు. శ్రీకాంత్ తీసుకున్న విజన్‌కు నాని 100 శాతం న్యాయం చేశారు. అందులో మేం భాగమవడం అదృష్టంగా భావిస్తున్నాం. మా యాక్షన్ బ్లాక్స్ పూర్తి చేయడానికి దాదాపు పది రోజులు పట్టింది. ఇందులో కొత్త మనుషులు, కొత్త బాడీ లాంగ్వేజ్.. అంతా కొత్తగానే ఉంటుంది. దర్శకుడు శ్రీకాంత్ ఎంచుకున్న కథ సహజంగానే యాక్షన్‌ను



## ప్యారడైజ్ కోసం ఎవరు ఎంత రెమ్యునరేషన్స్ తీసుకున్నారో తెలుసా.

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం ది ప్యారడైజ్ పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ఇప్పటివరకు విడుదలైన పాటలు సినిమాపై మంచి హైప్‌ను తీసుకురాగా.. మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేయకపోవడం మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. అసలు సినిమాలో ఎలాంటి కథను చూపించబోతున్నారు. ? నాని పాత్ర ఎలా ఉండబోతోంది. ? అని ఆడియన్స్ లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ ‌ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. దీంతో ఈ చిత్రం ప్రధానంగా అడల్ట్ ఆడియన్స్, యూత్‌ను టార్గెట్ చేసేలా ఉండొచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ట్రైలర్ విడుదల చేయకుండా పాటలు, ప్రమోషనల్ కంటెంట్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు మేకర్స్. దీంతో కథపై ప్రేక్షకుల్లో రకరకాల ఊహాగానాలు కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో 'ది ప్యారడైజ్' అడ్వాన్స్ బుకింగ్స్‌కు మంచి స్పందన లభిస్తున్నట్లు ట్రేడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నాని సినిమాలకు ఉన్న మార్కెట్‌తో పాటు పాటలు క్రియేట్ చేసిన బజ్ కూడా దీనికి కారణంగా చెబుతున్నారు. ఇతర భాషల్లో పరిస్థితి ఎలా ఉన్నా.. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం సినిమాపై అంచనాలు గట్టిగానే కనిపిస్తున్నాయి. ది ప్యారడైజ్ ను నాని కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కించిన చిత్రంగా ప్రచారం జరుగుతోంది. ఈ సినిమా

## సీరియల్‌లో సింపుల్ లుక్స్..



బుల్లితెర సీరియల్స్‌కు తెలుగు ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ కథాంశాలతో ఎన్నో సీరియల్స్ ప్రేక్షకులను అలరిస్తున్నాయి. కథలు కొన్ని సందర్భాల్లో రొటీన్‌గా అనిపించినప్పటికీ.. నటీనటుల సహజమైన నటన, ఎమోషనల్ పెర్ఫార్మెన్స్ కారణంగా ఆయా సీరియల్స్‌కు మంచి ఆదరణ లభిస్తోంది. ముఖ్యంగా గత కొంతకాలంగా సీరియల్ నటీనటులకు కూడా సినిమాల హీరోహీరోయిన్ల తరహాలో ప్రత్యేకమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడుతోంది.బుల్లితెరపై గుర్తింపు తెచ్చుకున్న పలువురు నటీనటులు వెండితెరపై అవకాశాలు అందుకుంటుండగా.. మరికొందరు సోషల్ మీడియాలోనూ భారీగా ఫాలోవర్లను సంపాదించుకుంటున్నారు. అలాంటి వారిలో కన్నడ బ్యూటీ అమూల్య గౌడ ఒకరు. తెలుగులో ఈమెను చూసినవారికి మాత్రం 'మీనా' అంటేనే వెంటనే గుర్తొస్తుంది. ప్రస్తుతం స్టార్ మాలో ప్రసారమవుతున్న 'గుండెనిండా గుడిగంటలు' సీరియల్‌లో మీనా పాత్రలో నటిస్తూ తెలుగు ప్రేక్షకులకు దగ్గరవుతోంది. 'గుండెనిండా గుడిగంటలు' సీరియల్‌లో అమూల్య గౌడ ఒక అమాయకమైన, కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇచ్చే అమ్మాయి పాత్రలో కనిపిస్తోంది.బుల్లితెరపై గుర్తింపు తెచ్చుకున్న పలువురు నటీనటులు వెండితెరపై అవకాశాలు అందుకుంటుండగా.. మరికొందరు సోషల్ మీడియాలోనూ భారీగా ఫాలోవర్లను సంపాదించుకుంటున్నారు. అలాంటి వారిలో కన్నడ బ్యూటీ అమూల్య గౌడ ఒకరు. తెలుగులో ఈమెను చూసినవారికి మాత్రం 'మీనా' అంటేనే వెంటనే గుర్తొస్తుంది. ప్రస్తుతం స్టార్ మాలో ప్రసారమవుతున్న 'గుండెనిండా గుడిగంటలు' సీరియల్‌లో మీనా పాత్రలో నటిస్తూ తెలుగు ప్రేక్షకులకు దగ్గరవుతోంది. 'గుండెనిండా గుడిగంటలు' సీరియల్‌లో అమూల్య గౌడ ఒక అమాయకమైన, కుటుంబ విలువలకు ప్రాధాన్యత ఇచ్చే అమ్మాయి పాత్రలో కనిపిస్తోంది.తన నటనలో సహజత్వాన్ని చూపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా భావోద్వేగ సన్నివేశాల్లో ఆమె పెర్ఫార్మెన్స్‌కు మంచి స్పందన వస్తోంది.

## 16 ఏళ్లకే చేదు అనుభవం.. బీ గ్రేడ్ సినిమాలు.



సి నీ , టె లి వి జ న్ రంగంలో కనిపించే స్టార్‌డమ్ వెనుక ఎన్నో కష్టాలు, కన్నీళ్లు, అవమానాలు దాగి ఉంటాయి. తెరపై ఎంతో సంతోషంగా కనిపించే నటీనటులు.. తమ కెరీర్ ప్రారంభంలో ఎన్నో చేదు అనుభవాలను ఎదుర్కొంటుంటారు. ముఖ్యంగా అవకాశాల కోసం ప్రయత్నించే సమయంలో కొందరు ఎదుర్కొనే పరిస్థితులు ఆందోళన కలిగిస్తుంటాయి. ఇలాంటి అనుభవాలను చాలామంది తారలు సంవత్సరాల తర్వాత బయటపెడుతున్నారు. తాజాగా టెలివిజన్ నటి, బిగ్ బాస్ ఫేమ్ రష్మీ దేశాయ్ తన కెరీర్ తొలినాళ్లలో ఎదురైన ఓ భయానక సంఘటనను గుర్తుచేసుకున్నారు.కేవలం 16 ఏళ్ల వయసులోనే ఓ ఆడిషన్‌కు వెళ్లిన సమయంలో తనకు ఎదురైన అనుభవాన్ని గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. ఆ ఘటనను గుర్తుచేసుకుంటూ తాను ఎంత భయపడ్డానో వివరించారు. రష్మీ దేశాయ్ చెప్పిన వివరాల ప్రకారం.. కెరీర్ ప్రారంభంలో ఆమెను ఓ ఆడిషన్ కోసం పిలిచారు. అవకాశంపై ఆశతో అక్కడికి వెళ్లిన ఆమెకు అక్కడ ఊహించని పరిస్థితి ఎదురైంది. ఆ ప్రదేశంలో తనతో పాటు మరెవరూ లేకపోవడంతో అనుమానం కలిగిందని ఆమె తెలిపారు. కేవలం 16 ఏళ్ల వయసులోనే ఓ ఆడిషన్‌కు వెళ్లిన సమయంలో తనకు ఎదురైన అనుభవాన్ని గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించారు. ఆ ఘటనను

## ఆమె చాలా తెలివైంది.. ఇలా నిలదొక్కుకోవడం అంటే మామూలు విషయం కాదు



అంతేకాకుండా, ఉదయభాను తన తండ్రి గొప్ప వారసత్వం గురించి అనేక విషయాలు పంచుకున్నారు. తన తండ్రి కలం పేరు కూడా ఉదయభాను అని, ఆయన కోహెడ్‌లో విగ్రహం ఉన్న గొప్ప వ్యక్తి అని తెలిపారు. ఒక వ్యక్తికి ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా ఊర్లో విగ్రహం పెట్టడం అసాధ్యమని, ఇది తన తండ్రి గొప్పతనాన్ని తెలియజేస్తుందని ఉదయభాను అన్నారు. తన తండ్రి రాసిన కవితలన్నీ బయటకు వచ్చి ఉంటే బాగుండేదని, అయితే తాను చిన్నప్పుడే నాన్నకి దూరమవడం వల్ల వాటిని భద్రపరచలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తన తండ్రి కవితలు విప్లవాత్మకంగా ఉండేవని, అప్పటి పెత్తనం, దొరల మీద ఆయన కవితలు రాసేవారని, ఊరంతా కూర్చొని ఆయన కథలు వినేదని ఊరి ప్రజలు తనకు చెప్పేవారని గుర్తు చేసుకున్నారు.

తన తండ్రి గురించి ఒక జ్ఞాపకాన్ని కూడా ఉదయభాను పంచుకున్నారు. ఒక బాపు, రాములు మామ అని పిలవమనే వ్యక్తి, ఒకరోజు తమ ఇంటికి వచ్చి, చిన్నపిల్ల అయిన ఉదయభాను కాళ్ళు పట్టుకొని ముద్దు పెట్టుకున్నాడని, ఆమె వేలును తన తండ్రి వేలితో పోల్చుకొని "నాన్న కాళ్ళు, నాన్న కాళ్ళు" అని ఏడ్చాడని తెలిపారు. ఇది తన తండ్రి పట్ల ప్రజలకు ఉన్న ఆదరాభిమానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. తన తండ్రి దాదాపు 150 ఎకరాల భూమిని గ్రామానికి దానం చేశారని, ఆయన ఒక జమీందారని ఊరి ప్రజలు చెప్పేవారని ఉదయభాను వెల్లడించారు. ఆయనకు ఉన్న భావజాలమే ఆ దానానికి కారణమని, అయితే తమ కుటుంబం ఆ ఆస్తి నుంచి ఒక్క చిల్లిగవ్వ కూడా తీసుకోలేదని ఉదయభాను స్పష్టం చేశారు.

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224